AL - HILAL

# నెలవంక

మాస పత్రిక

Vol 5, Issue: 33 July - 2009

مجلة الهلال (باللغة التلغوية) – ملحق مجلة البشرى

## భారత దేశానికి ఉజ్వల భవిష్యత్తు



## మర్యమ్ కుమారుడగు యేసు శిలువపై మరణించారా?

## కల చెదిరింది... కథ మారింది..



IPC

لجنة التعريف بالإسلام

ISLAM PRESENTATION COMMITTEE

جمعية النجاة الخيرية

ఉచితం

سُبْحَانَ الَّذِي أَسْرَى بِعَبْدِهِ لَيْلاً مِّنَ الْمَسْجِدِ الْحَرَامِ إِلَى الْمَسْجِدِ الأَقْصَى الَّذِي بَارَكْنَا حَوْلَهُ لِنُرِيَهُ مِنْ آيَاتِنَا إِنَّهُ هُوَ السَّمِيعُ الْبَصِيرُ

(سورة ١ : ١٧)

"తన దాసుణ్ణి రాత్రికి రాత్రే మస్జిదె హరామ్ నుండి మస్జిదె అఖ్సా వరకు తీసుకుపోయిన అల్లాహ్ పరిశుద్ధుడు. దాని పరిసరాలను మేము శుభవంతం చేశాము. ఎందుకంటే; మేమతనికి (మా శక్తిసామర్థ్యాలకు సంబంధించిన) కొన్ని సూచనలను చూపదలిచాము. నిశ్చయంగా అల్లాహ్ మాత్రమే బాగా వినేవాడు, చూసేవాడు." (దివ్య ఖుర్ఆన్- 17: 1)



# నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 5, ISSUE: 33
JULY 2009



CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Muhd. Azeezur Rahman

ASSOCIATE EDITORS
Mujahid Khan Omeri
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Abdul Qadir Omeri
Sk Abdus Salam Omeri
Tahera Begum

DESIGN
Noushad Zainulabdeen

www.zukhruf.net
Tel. 99993072



PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait



PHONES
Azeezur Rahman
22444117 EXT. 110
Mujahid Khan Omeri
24711141 EXT. 104

FAX
22400057

E-MAIL
nelavanka@ipc-kw.com

WEBSITE
www.ipc-kw.com

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT




10

## కల చెదిరింది...

19

## ఖుర్‌ఆన్ అందరి గ్రంథం



ఈ సంచికలో....


| | |
|---|---|
| దృక్పథం | 2 |
| భారత తొలి మహిళా స్పీకర్ | 3 |
| శాంతికి, ప్రగతికి, ముక్తికి.. | 4 |
| భారత దేశానికి ఉజ్వల భవిష్యత్తు.. | 6 |
| ఆ మహా మిత్రుడే కావాలి... | 8 |
| అకారణంగా హర్తాళ్లు చేయటం.. | 9 |
| కల చెదిరింది... కథ మారింది... | 10 |
| మేరాజ్ కానుక నమాజ్ | 12 |
| సీరత్ క్విజ్ | 13 |
| యేసు శిలువపై మరణించారా? | 14 |
| ఐపిసి వార్తలు | 16 |
| అట్టి స్వామి నిను వదిలేసి | 18 |
| అల్లాహ్ అందరి ప్రభువు | 19 |
| ఉత్తరాలు | 20 |




16


◆ كلمة العدد ◆ أخبار الهند ◆ مقابلة مع ذاكر نايك ◆ تتمة الرحيق المختوم ◆ الفتاوى الشرعية
◆ رسالة إلي الوالد ◆ دروس من الإسراء والمعراج ◆ أحكام الصلاة (تربية المهتدين)
◆ أسئلة عن السيرة ◆ هل صلب صلب عيسى؟ ◆ أخبار اللجنة ◆ ما غرك بربك الكريم؟ (المهتدي)
◆ الله رب العالمين ◆ رسائل



# నిదానమే ప్రధానం

ప్రియమైన పాఠకులకు,

రాను రాను మన జీవితాల్లో స్పీడు పెరిగిపోతోంది. కోర్కెల సాధన కోసం అహోరాత్రులు పరుగెడుతున్నాం. ఎలాగైనాసరే లక్ష్యాన్ని ఛేధించాలని ఆరాటపడుతున్నాం. ఇందులో తప్పేమీ లేదు. మనం కష్టపడి సంపాదించినపుడే మన కాళ్లపై నిలబడగలుగుతాము. మనపై ఆధారపడిన మన కుటుంబీకులను పోషించుకోగలుగుతాము. అవసరార్థులను ఆదుకోగలుగుతాము. మనం కష్టపడి, చెమటోడ్చి సంపాదించిన దానితో ఆలు బిడ్డలకు తినిపించే అన్నం ముద్ద కూడా మన పాలిట 'పుణ్యకార్యం'గా నమోదవుతుందని శుభవార్త ఇవ్వబడింది. అంతకన్నా ఏం కావాలి?

అయితే ఈ ఆశల ఆరాటంలో మనం మన 'వ్యక్తిత్వాన్ని' మరచిపోకూడదు. లక్ష్యాన్ని ఛేధించటం ఒక్కటే ముఖ్యం కాదు, ఎలా ఛేదిస్తున్నామన్నది కూడా ప్రధానమే. దీన్ని గనక విస్మరిస్తే మన జీవితాల్లో అసహనం, అపసవ్యత, ఆవేశం, అసంతృప్తి మనకు తెలియకుండానే జొరబడతాయి. సమాజంలోని సహిష్ణుతాభావాన్ని దెబ్బతీస్తాయి. సహజీవన భావాలకు విఘాతంగా పరిణమిస్తాయి. మనం మన కుటుంబీకుల మధ్యన ఉన్నా, బంధుమిత్రుల మధ్య ఉన్నా, ఆఫీసులో పని చేస్తున్నా, అంగడికి వెళ్లినా, చివరికి ఆరాధనా స్థలాలలో ఉన్నా మన గుణం ఎటువంటిదో బయట పెట్టేస్తుంటాయి.

కాబట్టి మనం సాధ్యమైనంతవరకు సౌమ్యంగా ఉండాలి. నిదానాన్ని అలవర్చుకోవాలి. 'నిదానమే ప్రధానమ'న్న ప్రవచనాన్ని ఒంటబట్టించుకోవాలి. మృదుత్వం, మన్నింపుల వైఖరిని పుణికిపుచ్చుకోవాలి. మృదుత్వం మనిషి వ్యక్తిత్వానికి వన్నె తెచ్చే అపురూపమైన ఆభరణం. ఈ ఆభరణంతో ముస్తాబైన వారిని లోకంలో అందరూ ఇష్టపడతారు. ఆదరిస్తారు, అందలం ఎక్కిస్తారు. దేవుడు కూడా అలాంటి వారిని ప్రేమిస్తాడు. ఎందుకంటే దేవుడు సైతం మృదుస్వభావి. ఆయన అన్ని విషయాల్లోనూ మృదుత్వాన్ని ఇష్టపడతాడు. కాఠిన్యం వల్ల ప్రసాదించని దానిని మృదుత్వం, లావణ్యాల మూలంగా అనుగ్రహిస్తాడు. అందుకే మనం మన పరస్పర వ్యవహారాలలో మార్దవంతో మెలగాలి. మన సత్ప్రవర్తన, సదాచరణలు కూడా 'సౌందర్యాన్ని' సంతరించుకునేలా జాగ్రత్త వహించాలి. ఎందుకో తెలుసా!? మన ప్రభువైన **"అల్లాహ్ సుందర స్వరూపుడు. ఆయన సౌందర్యాన్ని ఇష్టపడతాడు"**.

అందుకే ఓ పాఠకులారా! మనం ఏ పుణ్యకార్యం చేసినా, ఏ లక్ష్యాన్ని ఛేదించినా, ఏ కార్య క్షేత్రంలో పని చేసినా అత్యుత్తమ రీతిలో చేసేందుకు శాయశక్తులా యత్నించాలి. మనతో కలిసిమెలిసి ఉండేవారి పట్ల మృదువుగా మెలగాలి. వీలైనంతవరకు వారి పొరపాట్లను ఉపేక్షించాలి. వారి ద్వారా కలిగే ఇబ్బందులకు సర్దుకుపోవాలి. వారి తప్పులను మన్నించాలి. ముఖ్యంగా మంచిని పెంచడానికి నడుం బిగించి, సంస్కరణా సరణిలో సాగిపోయే వారిపై ఈ బాధ్యత మరింత అధికంగా ఉంటుంది.

# భారత తొలి మహిళా స్పీకర్



...ఆమె మమతా బెనర్జీ లాంటి ఫైర్ బ్రాండూ కాదు, సుష్మా స్వరాజ్ మాదిరి అనర్గళ వక్తా కాదు, మాయావతి లాగా దాషింగ్ నేచర్ ఉన్న మహిళా కాదు, షీలా దీక్షిత్ మాదిరిగా గొప్ప అడ్మినిస్ట్రేటర్ కూడా కాదు. ఆమె ఒక సాదాసీదా మహిళ.. దళిత మహిళ.. విద్యావంతురాలు, నెమ్మదస్తురాలు, ఆచి చూచి మాట్లాడే స్వభావం ఆమెది. రెచ్చిపోని తత్వం, మిత భాషిణి, మృదు భాషిణి... ఆమె ఎవరో కాదు, భారత తొట్ట తొలి లోక్ సభ మహిళా స్పీకర్... దళిత మహిళా స్పీకర్ **శ్రీమతి మీరా కుమార్.**

1979 ఆగస్టులో బాబూ జగ్జీవన్‌రామ్‌కు ప్రధానమంత్రి అయ్యే అవకాశం లభించింది. అయితే భారత రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి అనూహ్యంగా మధ్యంతర ఎన్నికలు ప్రకటించి, ఒక దళితుడ్ని భారత ప్రధాని కాకుండా అడ్డుకున్నారని జనతా పార్టీ నాయకులు రాష్ట్రపతి నివాసం ఎదుటే నిరసన ప్రదర్శనలు జరిపారు. ఆ దళిత నాయకుని గారాల పట్టియే ఈ మీరాకుమార్.

నిన్నటి వరకూ ఆమెను ఎవరూ అంతగా పట్టించుకోలేదు. భారత రాజకీయ పరిస్థితుల స్వరూపం ఆమెను ఒక్కసారిగా ఎనలేని గౌరవాన్ని తెచ్చిపెట్టింది. ఐదేళ్ళ క్రితం భారత ప్రధాని కాబోతున్న 'ఒక మహిళ'ను 'భూమి పుత్రులు' అడ్డుకోవడంతో 'ఆమె' తెలివిగా వెనక్కి తగ్గింది. 'త్యాగ శీలి' అని కితాబు పొందింది. ఇప్పుడు తెరవెనుక నుండి 'అనురాగశీలి'గా చక్రం తిప్పుతూ ఒక్కొక్క మహిళనే తెరపైకెక్కిస్తోంది... అదీ అత్యున్నత శిఖరాలపైన!

నిన్న ప్రతిభా పాటిల్ వంతు... నేడు మీరా కుమార్ వంతు.. రేపు ఇంకొక మహిళా ఆవిష్కరణ అనూహ్యంగా జరగవచ్చు. (తెలుగు నాట చెల్లెమ్మ సబితా ఇంద్రారెడ్డి తొట్ట తొలి మహిళా హోం మంత్రిగా నియమించబడటం కూడా కాకతాళీయం కాదు సుమా!)

1945లో పాట్నాలో జన్మించిన మీరాకుమార్ ఢిల్లీ వర్సిటీలో ఉన్నత విద్యనార్జించారు. న్యాయశాస్త్రంలో డిగ్రీ పుచ్చుకున్నారు. 1973లో ఇండియన్ ఫారిన్ సర్వీస్ (**IFS**) లో చేరి బ్రిటన్, స్పెయిన్‌లలో దౌత్యాధికారిగా పని చేశారు. 1985లో ఎం.పిగా గెలిచి రాజకీయ అరంగేట్రం చేశారు. ఎ.ఐ.సి.సి ప్రధాన కార్యదర్శిగా కూడా ఉన్నారు. అందరిలాగే ఆమె కూడా గెలుపోటములను చవిచూశారు. ప్రస్తుతం మీరాకుమార్ బీహార్‌లోని ససరామ్(ఎస్.సి) నియోజకవర్గం నుంచి గెలిచారు. కేంద్రంలో జల వనరుల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మూడు రోజులకే ఆమెకు కాంగ్రెస్ అధిష్టానవర్గం నుంచి కబురందింది. మొత్తానికి 'త్యాగశీలి' వ్యూహ రచనలు ఫలిస్తున్నాయి. ఒక మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తి భారత ప్రధానిగా వెలిగిపోతున్నారు. మరో మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. అధిక సంఖ్యాక వర్గానికి చెందిన ఒక మహిళామణి భారత రాష్ట్రపతి అయ్యారు. దళిత వర్గానికి చెందిన ఇంకొక మహిళ ఇప్పుడు లోక్‌సభలో సభాపతి కుర్చీపై దర్జాగా ఆశీనులయ్యారు. భారత రాజకీయ చిత్రపటంపై 'భూమి పుత్రుల'ను ఆశ్చర్యపరిచే పరిణామాలు ఇంకెన్ని చోటు చేసుకుంటాయన్నది వేచి చూడాల్సిన విషయం.

**"ఈ కాల చక్రాన్ని మేము జనుల మధ్య వంతువారీగా త్రిప్పుతుంటాము".**

(దివ్య ఖుర్‌ఆన్ -3:140)



## శాంతికి, ప్రగతికి, ముక్తికి

# పద్నాలుగు సూత్రాల పథకం

**ఇస్లామీయ చరిత్రలో రెండు రాత్రులకు ఎనలేని ప్రాముఖ్యం ఉంది. ఒకటి: మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం)పై ఖుర్ఆన్ అవతరించిన రాత్రి. రెండవది: ఆయన (సఅసం)కు మేరాజ్ (గగనయాత్ర) భాగ్యం ప్రాప్తించిన రాత్రి.**



– ముహమ్మద్ అజీజుర్రహ్మాన్


ఈ గగనయాత్ర సందర్భంగా మహాప్రవక్త (స)కు కొన్ని సూచనలు (దృశ్యాలు) చూపబడ్డాయి. కార్యాచరణ పరిధిలో మనిషి సమత్వం, సమతూకాలను విడనాడి హద్దు మీరటం వల్ల కలిగే నష్టమేమిటో సంకేత ప్రాయంగా విడమరచి చెప్పడం జరిగింది. ఒక మంచి సమాజాన్ని స్థాపించటానికి ప్రజలు సామూహికంగా ఏ ఏ సూత్రాలను పాటించాలో కూడా స్పష్టంగా బోధపర్చడం జరిగింది. దివ్య ఖుర్ఆన్‌లోని బనీ ఇస్రాయీల్ సూరా మొత్తం మేరాజ్ (గగనయాత్ర) నేపథ్యంలోనే అవతరించింది. ముఖ్యంగా ఈ సూరాలోని 23వ వచనం నుండి 39వ వచనం వరకు మొత్తం "14 సూత్రాల పథకం" మానవ సమాజానికి ప్రసాదించబడింది. ఈనాడు అంతర్జాతీయ స్థాయిలో రూపుదిద్దుకునే మానవ హక్కులైనా (HUMAN RIGHTS), కార్మిక చట్టాలైనా (LABOUR ACTS), సామాజిక న్యాయం (SOCIAL JUSTICE) నినాదాలైనా, జాతుల మధ్య జరిగే ఒడంబడికలైనా, నాగరికత (CIVILIZATION)కు సంబంధించిన నీతి సూత్రాలైనా, రాజ్యాంగాల్లోని నిర్దేశిక నియమాలు (DIRECTIVE PRINCIPLES) అయినా – వీటన్నింటికీ ఆయుఃపట్టు ఏమంటే అవి మేరాజ్ వరప్రసాదాలైన ఈ 14 సూత్రాలే. విశ్వ విఖ్యాత ఇస్లామీయ తత్వవేత్త మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూదీ (రహ్మాలై) ఈ 14 సూత్రాలను తనదైన శైలిలో విశదీకరించారు. రండి, ఆ పద్నాలుగు సూత్రాల పథకాన్ని ఓసారి సింహావలోకనం చేసుకుందాం–

1) ఒక్కడైన నిజ దైవాన్ని తప్ప వేరొక దైవాన్ని అంగీకరించకూడదు. ఆయన ఒక్కడే మీ ఆరాధ్య దైవం. కాబట్టి మీరు ఆయన్నే పూజించండి. ఆయన ఆజ్ఞలను శిరసావహించండి. ఆయనకే విధేయత చూపండి. ఇది దేవుని హక్కు. ఆయన్ని తప్ప వేరొకరిని గనక మీరు మీ సార్వభౌమునిగా ఒప్పుకుంటే నిందార్హులవుతారు. ఒక్కడైన నిజదేవుని నుండి లభించే సహాయానికి మీరు దూరమైపోతారు.

2) మానవ హక్కుల్లో అత్యంత ముఖ్యమైనది, ప్రప్రథమమైనది తల్లిదండ్రుల హక్కు. పిల్లలు తమ తల్లిదండ్రులకు విధేయులై ఉండాలి. వారికి సేవలు చేయాలి. వారి ముందు అణకువ చూపాలి. ముఖ్యంగా వృద్ధాప్యంలో తల్లిదండ్రుల ముచ్చట తీర్చాలి. ఎందుకంటే వారు మిమ్మల్ని బాల్యంలో అల్లారు ముద్దుగా పెంచారు.

3) సామూహిక జీవితంలో నిగ్రహం, సంయమనంతో మెలగాలి. పరస్పరం సహాయ సహకారాలు అందించుకోవాలి. ఒండొకరికొరకు త్యాగ భావన అలవరచుకోవాలి. పరుల హక్కును గుర్తించాలి. ప్రతి బంధువు తన బంధువులకు చేదోడు వాదోడుగా ఉండాలి. ప్రతి అవసరార్థుడు సాటి మనుషుల నుండి తోడ్పాటును పొందే హక్కుదారుడని తెలుసుకోవాలి. ఏ బాటసారి కొత్త ప్రదేశానికి వెళ్ళినా అక్కడి ప్రజలను తన హక్కునిచ్చే వారుగా పొందాలి. సమాజంలో జీవించే ప్రతి వ్యక్తి సాటి జనుల యెడల తనకు గల హక్కులు–బాధ్యతలను గుర్తెరగాలి. అడిగినవారికి సహాయం చేసే స్థోమత లేనప్పుడు మృదువుగా సాగనంపాలి. అదే సమయంలో దైవానుగ్రహం కోసం ప్రార్థించాలి. ఎందుకంటే తమకు స్థోమత ఉంటే ఇతరులకు సాయం చేయవచ్చుకదా!

4) ప్రజలు తమ దగ్గరున్న ధనాన్ని దుర్వినియోగపర్చరాదు. అవసరమున్న చోట ఖర్చు పెట్టాలి. బడాయి కోసం డబ్బును తగలెట్టడం, భోగలాలసత్వం కొరకు సంపదను దుబారా ఖర్చుపెట్టడం అనర్ధదాయకం. పైగా ఇది దైవానుగ్రహాల విలువను గుర్తించక పోవటమే. ఇలాంటి జల్సా రాయుళ్ళు షైతాన్ సోదరులవుతారు.



5) ఖర్చు విషయంలో జనులు అనునిత్యం సమతూకం పాటించాలి. ఇటు మరీ పిసినారులుగానూ ఉండకూడదు, అటు మరీ విచ్చలవిడిగానూ ఖర్చు చేయకూడదు. పైగా వారి ఖర్చు రెండు వైపరీత్యాలకు నడుమ సమతౌల్యం కలిగి ఉండాలి.

6) దేవుడు ఈ లోకంలో నెలకొల్పిన ఉపాధి పరపకంలో మానవుడు తన కృత్రిమ ఉపాయాలతో జోక్యం చేసుకుని అస్తవ్యస్తం చేయరాదు. దేవుడు జీవనోపాధి విషయంలో హెచ్చు తగ్గులు పెట్టాడు. అందులో దాగివున్న పరమార్థాలు దైవానికే ఎరుక. సహజమైన ఈ అసమానతలను అసహజమైన అసమానతలతో మార్చివేయబోయి, ఇంకొక అన్యాయానికి పాల్పడటం తప్పు.

7) మంది ఎక్కువైతే మజ్జిగ పలుచన అయిపోతుందేమోనన్న భయంతో సంతాన హత్యకు పాల్పడటం మహా పాతకం. ఈ దారుణానికి పాల్పడేవారు, ఉపాధి తాళం చెవులు తమ చేతుల్లో ఉన్నాయని తలపోస్తున్నారన్న మాట! యదార్థానికి మానవ కోటిని ఈ లోకంలో వసింపజేసిన దేవుడే అన్నపానీయాలను ఇస్తున్నాడు. మీ పూర్వీకులకు ఉపాధినిచ్చినవాడూ ఆయనే. మీ భావితరాలకు జీవనోపాధిని ప్రసాదించేది కూడా ఆయనే. జనాభా పెరిగినకొద్దీ ఆర్థిక ఒనరులను విస్తృత పరచడం ఆయన ప్రణాళిక. కాబట్టి జనులు దైవప్రణాళికలో అనుచితంగా జోక్యం చేసుకోకూడదు. ఎట్టి పరిస్థితిలోనూ 'సంతాన హత్య'కు పాల్పడే దురాలోచనకు తావీయవద్దు.

**స్త్రీ**

**మీ తల్లి మీ చెల్లి**

**మీ బిడ్డ మీ భార్య**

**ఆమెను గౌరవించండి.**

8) ఒక స్త్రీకి – ఒక పురుషునికి మధ్య అక్రమ సంబంధం అనేది పరమ నీచ కార్యం. అది నిషేధించబడటంతోపాటు వ్యభిచారానికి దారి తీసే ద్వారాలన్నింటినీ సమాజంలో మూసివేయాలి.

9) మానవ ప్రాణం పవిత్రమైనది. ఏ వ్యక్తికీ తన్ను చంపుకునే హక్కుగానీ, ఇతరుల ప్రాణాలు తీసే హక్కు గానీ లేదు. ఒకవేళ ఎవరికయినా మరణ దండన విధించాలన్నా న్యాయ (ధర్మ) బద్ధంగా మాత్రమే విధించాలి.

10) తండ్రి లేని బిడ్డలు పెరిగిపెద్దవారై, తమ కాళ్లపై నిలబడే వరకూ వారి ఆస్తి పాస్తులను రక్షించాలి. బాగు పరిచే ఉద్దేశ్యంతో తప్ప వారి సంపదను పెట్టుబడిగా పెట్టరాదు.

11) ఒప్పందాలు వ్యక్తుల మధ్య జరిగినా, జాతుల మధ్య జరిగినా – వాటిని చిత్తశుద్ధితో నెరవేర్చాలి. ఒప్పందాలను ఉల్లంఘించిన పక్షంలో దేవుడు నిలదీస్తాడు.

12) కొలతలు, తూనికల్లో న్యాయంగా వ్యవహరించాలి. లావాదేవీలలో మోసానికి పాల్పడకూడదు.

13) మీకు తెలియని విషయాల వెంటపడి, కూపీలు లాగే యత్నాలు చేయకండి. మీ చెవులు, కళ్ల విషయంలో మీరు దేవుని సమక్షంలో ప్రశ్నించబడతారు. మీ మనోమస్తిష్కాలలో పుట్టే ఆలోచనల గురించి ప్రశ్నించబడతారు.

14) భూమిపై పొగరుబోతుల్లా విర్రవీగుతూ నడవకండి. మీ ప్రతాపంతో మీరు భూమిని చీల్చనూ లేరు. గర్వాతిశయంతో పర్వతాల ఎత్తుకు చేరుకోనూ లేరు.



# భారత దేశానికి ఉజ్వల భవిష్యత్తు ఉంది

అమ్జదలీ ఖాన్



(గత సంచిక తరువాయి భాగం)

**శే.గు: జాకిర్ నాయక్ గారు, మీరొక ఎంబిబియస్ డాక్టరు. కాని డాక్టరుగా మీకెక్కువ ప్రాక్టీస్ లేదనుకుంటాను.**

జా.నా: బేసికల్లీ.

**శే.గు: మీ అభిప్రాయాలను కొంతమంది అంగీకరించకపోవటాన్ని బట్టి నేను భావిస్తున్నదేమిటంటే వారు యువకులై ఉండవచ్చు. కొందరు ముస్లిం యువకులు భారత దేశం పట్ల కోపంతో ఉన్నారు?**

జా.కి: యువకులు కొంత మంది తప్పు దోవ పట్టి ఉండొచ్చు. నా ప్రసంగాలకు హెచ్చు సంఖ్యలో యువత తరలి రావటం మీరు గమనించవచ్చు. అసలు విషయమేమిటంటే అపార్థాల వల్ల వారు పెడత్రోవ పట్టి ఉండొచ్చు. కాబట్టి నేను చెప్పేదేమిటంటే నా దేశం పట్ల నాకు గర్వంగా ఉంది. ఈ దేశంలో ఉన్నందుకు సంతోషంగా ఉంది. ఈ దేశంలోనే జీవించడం నాకిష్టం.

**శే.గు: మీరు మీ ప్రసంగాల ద్వారా, మీ చర్చల ద్వారా వారికి సరైన సమాచారం ఇస్తున్నారన్న మాట.**

జా.నా: అవును.

**శే.గు: భారత జాతీయతకి – ఇస్లాంకి మధ్య ఎలాంటి భేదం లేదని మీరు వారికి చెబుతున్నారనుకోవచ్చా?**

జా,నా: జాతీయతకు సంబంధించినంత వరకు ఆ పదానికి విభిన్న అర్థాలు ఉన్నాయి.

**శే.గు: సరే...**

జా.నా: ఒకవేళ దేశం జాతీయతను పాటిస్తూ ఉన్నట్లయితే నేనందుకు సిద్ధం. ఖుర్ఆన్ మరియు హదీసు తెలిపేదేమిటంటే మీరు నివసిస్తున్న దేశంలో ఖుర్ఆన్, హదీసులు చట్టాలకు, దైవం, దైవప్రవక్తల చట్టాలకు విరుద్ధంగా ఆస్కారం ఉండనంత వరకూ ఆ దేశ చట్టాలను పాటించాల్సి ఉంటుంది. దీనికి నేను సిద్ధమే.

**శే.గు: వైరుధ్యానికి తావు లేదన్న మాట.**

జా.కి: అవును, లేదు.

**శే.గు: మీకు తెలుసనుకుంటా. ఒక విషయమేమిటంటే ప్రస్తుతం పాశ్చాత్య దేశాల్లో ఎక్కువగా వినబడేదేమిటంటే భారత దేశం అత్యధిక ముస్లిం జనాభా గల దేశమని?**

జా.నా: అవును. ప్రపంచంలోకెల్లా రెండవ అతి పెద్ద దేశం.

**శే.గు: కొద్దిమంది మాత్రమే దారి తప్పారు లేదా కొన్ని తీవ్రవాద కార్యకలాపాల్లో చిక్కుకున్నారు. అయితే అలాంటివారు చాలా తక్కువ. దాదాపు భారతీయ ముస్లింలు తీవ్రవాద కార్యకలాపాలలో తక్కువే ఉన్నారు. దీనికి కారణం రాజ్యాంగం అంటారా, లేదా రాజ్యాంగీకరణ అంటారా లేదా భారతీయ ఇస్లాం యొక్క ప్రత్యేక స్వభావం అంటారా?**

జా.నా: కాదు, రాజ్యాంగానికి సంబంధించి నేను ఇదివరకే చెప్పాను. రాజ్యాంగము చాలా ఉత్తమమైనది. ఇందులో వ్యతిరేకించాల్సింది ఏదీ లేదు.

**శే.గు: పోనీ వెయ్యి సంవత్సరాల సహజీవన చరిత్రంటారా?**

జా.నా: అవును. ముస్లింలు భారత దేశాన్ని వెయ్యేండ్లు పరిపాలించారు. మొగలుల కాలంలో మన దేశం ప్రపంచపటంలో అగ్ర దేశంగా వెలుగొందింది. ప్రపంచంలోనే ప్రబల శక్తిగా వెలుగొందింది. దురదృష్టవశాత్తు ఆంగ్లేయులు వచ్చి, ఇక్కడి సంపదను కొల్లగొట్టి హిందూ ముస్లింలను విభజించారు.

**శే.గు: అవును.**

జా.నా: నా అభిప్రాయం ప్రకారం హిందువులు-ముస్లింలు సామరస్యంతో కలిసి మెలిసి జీవించారు. 'విభజించి, పాలించు' (DIVIDE AND RULE ) అనే బ్రిటిష్ సూత్రం వల్లనే ఈ ఘర్షణలు ఏర్పడ్డాయి....

**శే.గు: మీరు ద్విజాతి సిద్ధాంతంపై ఎక్కువ మాట్లాడారా?**

జా.నా: 'ద్విజాతి సిద్ధాంతం' అంటే ఇండియా మరియు పాకిస్థాన్ గురించనా మీ ఉద్దేశం?

**శే.గు: అవును ఇండియా, పాకిస్థాన్.**

జా.నా: ఇండియా – పాకిస్థాన్‌లోని అందరి గురించా...

**శే.గు: కాదు కాదు. మీ దృక్పథం ఏమిటి? మరో అభిప్రాయం ఏమిటంటే ఒకవేళ దేశ విభజన జరగకుండా ఉంటే ఒక అఖండ దేశంగా ఉండేదని....**

జా.నా: నా అభిప్రాయం కూడా అదే!

**శే.గు: 45 కోట్ల మంది ముస్లింలతో...**

జా.నా: నా ఉద్దేశంలో మన దేశానికి జరిగిన అతి పెద్ద నష్టం దేశ విభజన. ఇది జరిగి ఉండాల్సింది కాదు. ముస్లింలు అందరూ కలిసి ఉంటే వారికెంతో మేలు జరిగేది.

**శే.గు: అలా అని ఎందుకనుకుంటున్నారు? దీని గురించి వివరంగా చెప్పండి.**

జా.నా: ఎందుకంటే నా దృష్టిలో అది ఒక శక్తిగా ఉండేది. ఇండియా- పాకిస్థాన్‌లలోని ఒనరులు ఒకచోట పెట్టినట్లయితే అది క్రీడల్లో కానివ్వండి, క్రికెట్‌లో కానివ్వండి లేదా మేధాశక్తిలో కానివ్వండి, ఇతరత్రా కూడా ఎంతో మేలు జరిగి మనమంతా ఒక ప్రబల శక్తిగా ఉండేవారము. భారతదేశం రానున్న కొన్నేండ్లలో అగ్రగామిగా నిలువబోతుంది. ఇప్పుడు చైనా- ఇండియా పోటీ పడుతున్నాయి. ఒకవేళ కలిసి ఉంటే ఎలా ఉండేదో ఆలోచించండి...పాకిస్థాన్ బంగ్లాదేశ్....

**శే.గు: మరి ముస్లింలకు కూడా రాజకీయంగా ఎంతో మేలు జరిగి ఉండేది.**

జా.నా: అందులో సందేహమే లేదు. విభజన ఎందుకు జరిగిందనే దానిపై అనేక వాదనలు ఉన్నాయి. నేను వాటి జోలికి వెళ్లదల్చుకోలేదు. ఇదంతా పకడ్బందీగా వేసిన పథకం ప్రకారం జరిగింది.

**శే.గు: మొత్తానికి ఈ విభజన ఉప ఖండంలోని ముస్లింలకు నష్టం కల్గించిం దంటారు.**

జా.నా: ఇది నా అభిప్రాయము. నూరు శాతము. వీరు గనక కలిసిమెలసి ఉంటే ఆర్థికంగా, విద్యావిషయకంగా తిరుగులేని శక్తి అయ్యేవారు.

**శే.గు: అంటే ముస్లింలు ఆత్మపరిశీలన చేసుకుంటున్నారా?**

జా.నా: ఇది కేవలం నా నమ్మకం, నేను అర్థం చేసుకున్న భావన ప్రకారం తమ హక్కుల్ని పొందే ఉద్దేశంతో చేసిన ఈ పని బెడిసికొట్టింది. లేదా విపక్షం దాన్ని ఒక 'అంశం'గా చేసి విడగొట్టింది.

**శే.గు: లేక దేశ విభజనకు కాంగ్రెస్ చాలా తేలికగా అంగీకరించి ఉండవచ్చా?**

జా.నా: విభజనకు కారకులైన ప్రజలతో పాటు, సంబంధిత రాజకీయ నాయకులు కూడా నికార్సయిన ధర్మావలంబీకులు కారు. నేను వివరాల జోలికి వెళ్లదల్చుకోలేదు.

**శే.గు: అప్పట్లో స్థితిమంతులైన ముస్లింలు, ముస్లిం మేధావి వర్గం అందరూ పాకిస్థాన్‌కు తరలి వెళ్ళారని చెబుతుంటారు.**

> **"నా నమ్మకం ప్రకారం అక్కడి ప్రజలు రాజకీయ నాయకులతో విసుగెత్తి పోయారు. వాళ్ళు ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారు. అందువల్లేవారు విసుగు చెందారు. అక్కడి వారు ఇటు ఇండియాలోగాని, అటు పాకిస్థాన్‌లోగాని ఉండేందుకు ఇష్టపడటం లేదు".**

జా.నా: అత్యధికులు వెళ్ళలేదు. చాలా మంది భారత దేశంలోనే ఉండిపోయారు. భారత ముస్లింల జనాభా పాకిస్థాన్ ముస్లిముల జనాభా కంటే చాలా ఎక్కువ.

**శే.గు: ప్రస్తుతం భారత ముస్లింలు అనేక రంగాల్లో రాణించడం చూస్తూనే ఉన్నాం. సచ్చార్ కమిటీ నివేదిక ప్రకారం అనేక ప్రాంతాల్లో వారు వెనుకబడి ఉన్నారు. వారిని ఉద్ధరించాల్సి ఉంది. అయినప్పటికీ చాలావరకు నిరూపించుకున్నారు.**

జా.నా: నేను పాకిస్థాన్‌లో కన్నా ఇండియాలోనే ఉండేందుకు ఇష్టపడతాను ఇదేంతో విశిష్టమైన దేశం.

**శే.గు: ఉదాహరణకు ఆస్కార్స్‌నే తీసుకోండి. ఇద్దరు ముస్లింలు వెళ్ళి ఆస్కార్ అవార్డులను గెలిచారు. బహుళ సంస్కృతి విభిన్న సమాజాల గురించి చెప్పుకోవాల్సింది ఎంతో ఉంది.**

జా.నా: అందరూ కలిసి ఉంటే ఇంకా ఎంతో శక్తిమంతమై ఉండేది. మరింత మేలు జరిగేది.

**శే.గు: మీకు పాకిస్థాన్‌లో అభిమానులు ఉన్నారా?**

జా.నా: వాస్తవంగా భారతదేశంకంటే పాకిస్థాన్‌లోనే వీక్షకులు ఎక్కువ.

**శే.గు: విచిత్రంగా మీ గురించి మొదటిసారి పాకిస్థానీ పాత్రికేయుడైన ఒక స్నేహితుడి ద్వారా విన్నాను. అతను మిమ్మల్ని ఉద్దేశించి "బొంబాయి నుండి ఉద్భవిస్తున్న కొత్త తార" అని చెప్పాడు. అప్పటి వరకూ మీ గురించి విన్లేదు.**

జా.నా: నా అభిప్రాయాల ద్వారా పాకిస్థాన్‌లోని ప్రేక్షకులను ఇబ్బంది పెట్ట దల్చుకోలేదు.

**శే.గు: అద్భుతం. పాకిస్తానీ కాలమిస్టు ఖాలిద్ అహ్మద్ ద్వారా తెలుసుకున్నాను. కాశ్మీర్ సమస్యను పరిశీలించినట్లయితే ఉపఖండంలో శాంతి స్థాపనకు భారత్ పాకిస్థాన్‌లు మూలకేంద్రాలు అవుతాయి. ప్రస్తుతానికి రెండు విడిగా ఉన్నా, అవి కలవకపోయినా ప్రజలు కలిసొస్తే కాశ్మీర్ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. మీ వద్ద దీనికి ఏదైనా పరిష్కార మార్గం ఉందా ?**

జా.నా: నావద్ద పరిష్కార మార్గమైతే లేదుగాని, నాకొక విషయం గుర్తుంది. 2003లో కాశ్మీర్‌కు నన్ను పిలువ బడినప్పుడు అక్కడ ఎన్నో సమస్యలుండేవి. ఇప్పటికన్నా ఎక్కువే. చివరగా నేను అక్కడ వెళ్ళినప్పుడు అక్కడి గవర్నర్‌ను కలిసాను. ఆయన నన్ను తిరిగి పిలిపించారు. ఆయనొక మాజీ సైన్యాధికారి. ఇక్కడ నాకు చాలా మంది అభిమానులు ఉన్నారని ఆయన నాతో చెప్పారు.

**శే.గు: జనరల్ సిన్హా?**

జా.నా: అవును. ఆయనే. నా నమ్మకం ప్రకారం అక్కడి ప్రజలు రాజకీయ నాయకులతో విసుగెత్తి పోయారు. వాళ్ళు ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారు. అందువల్లేవారు విసుగు చెందారు. అక్కడి వారు ఇటు ఇండియాలోగాని, అటు పాకిస్థాన్‌లోగాని ఉండేందుకు ఇష్టపడటం లేదు.

**శే.గు: కాని ఒక విషయం తెలుసా....**

జా.నా: కష్టం, చాలా కష్టం.

(ఇంకా ఉంది)

ఆధారం
అర్రహీఖుల్ మఖ్తూమ్

సంక్షిప్తీకరణ
సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ

# "ఆ మహా మిత్రుడే కావాలి..."

ఆ పిదప సతీమణులందరిని పిలిచి వారికి చెప్పవలసిన విషయాలు చెప్పి, హితోపదేశం కూడా చేశారు. ఆ తర్వాత ప్రజలందరిని ఉద్దేశించి ఇలా అన్నారు: 'నమాజ్, నమాజ్, బానిసలతో మంచిగా వ్యవహరించండి, ఆ తర్వాత శరీరమంతా డీలా పడిపోయింది. హజ్రత్ ఆయిషా (రజి) ఆయన్ను తన ఒడిలో పడుకోబెట్టారు. అప్పుడు ఆయన (స) **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** (అల్లాహ్ తప్ప ఆరాధ్య దైవం మరెవ్వరూ లేదు) అంటూనే ఉన్నారు. ఆ తర్వాత మిస్వాక్ తెప్పించి మిస్వాక్ చేశారు. ఆ సందర్భంలో ప్రవక్త (స) తరచూ ఇలా అనేవారు: 'ఆ మహా మిత్రుడు తప్ప ఇప్పుడిక ఎవరూ లేరు'. ఇలా మూడు సార్లు పలికారు. ఇలా పలుకుతూ ఉండగానే పరిస్థితి విషమించింది. ఆయన పవిత్ర ఆత్మ ఆ పరమ మిత్రుని వద్దకు చేరుకుంది. యావత్తు మదీనా శోక సముద్రంలో మునిగిపోయింది. **ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్.** (మీరు మరణించారు. అందరూ మరణించ వలసినవారే. మేమూ అల్లాహ్‌కు చెందిన వారమే. అందరూ మరలి పోవలసింది ఆయన వైపుకే).

రెండవ రోజు అబ్బాస్ బిన్ అబీ తాలిబ్ (రజి), హజ్రత్ అలీ ఇబ్ను అబీ తాలిబ్, అబ్బాస్ గారి ఇద్దరు పుత్రులు ఖసమ్ మరియు ఫజ్ల్, హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజియల్లాహు అన్హుం) కలసి దైవప్రవక్త (స) గారి భౌతిక కాయానికి స్నానం చేయించారు. మూడు వస్త్రాల్లో కఫన్ తొడిగించారు. ఆ తర్వాత దైవప్రవక్త (స) గారి విశ్రాంతి నిలయాన్ని ఎక్కడ స్థాపించాలన్న ప్రశ్న ఉదయించింది. హజ్రత్ అబూ బక్ర్ (రజి) జోక్యం చేసుకుని "ప్రతి దైవప్రవక్త విశ్రాంతి నిలయం ఆయన ఆత్మ తనువును వీడిన చోటే అవుతుందని స్వయంగా మన ప్రియ ప్రవక్తే చెబుతూ ఉండగా నేను విన్నాను" అన్నారు. ఆ తర్వాత హజ్రత్ అబూ తల్హా (రజి) ప్రవక్త (స) గారు ఉన్న పడకను తొలగించి ఆ స్థలంలోనే గుంత తవ్వారు. ఆ తర్వాత ఆయన్ను ఖననం చేశారు. ప్రజలందరూ పది పది మంది చొప్పున గదిలో ప్రవేశించి జనాజ నమాజు చేశారు. ముందు ప్రవక్త (స) వారి ఇంటివారు నమాజు చేశారు. ఆ తర్వాత ముహాజిర్లు, ఆ పిదప అన్సార్లు, ఆ తర్వాత స్త్రీలు, పిల్లలు అందరూ ఎవరికి వారే జనాజా నమాజ్ చేశారు.

అలా అంతిమ దైవప్రవక్త (స) అందరికి దర్శన భాగ్యం కలిగించి అశాశ్వతమైన ఈ ప్రపంచం నుండి శాశ్వతంగా తెర మరుగయ్యారు. ఆయనపై ఎల్లెడలా అల్లాహ్ శాంతి శ్రేయాలు వర్షించుగాక! ఆమీన్.

(సమాప్తం)

### ముఖ్య గమనిక

'నెలవంక'లో ధారా వాహికంగా వచ్చిన 'పవిత్ర జీవితం' శీర్షిక ఈ సంచికతో సమాప్తమయింది. కాని మహనీయ ముహమ్మద్ (సఅసం) వారి ప్రబోధనలు, జీవిత ఘటనలు ఓ మహా సాగరం వంటివి. వివిధ కోణాల నుంచి వాటిని వీక్షించాలి. ఇన్షాఅల్లాహ్ వచ్చే సంచిక నుండి వాటిని 'నెలవంక' పాఠకుల ముందుకు తీసుకువస్తాము. – ఎడిటర్





# అకారణంగా హర్తాళ్ళకు దిగటం అవాంఛనీయం

**ప్రశ్న :- కార్మికుల డిమాండ్లను సాధించడానికి, పరిస్థితులను మెరుగుపరచుకోవడానికి సమ్మెలు, హర్తాళ్ళు చేయటం గురించి షరీఅత్ ఆదేశాలేమిటి?**

జవాబు :- సమ్మెలు, హర్తాళ్ళకు పూనుకోవటం అనేది యజమానికి – కార్మికులకు మధ్య జరిగిన 'ఉద్యోగ ఒప్పందాన్ని' భగ్నం చేయటం క్రిందికి వస్తుంది. యజమానికి ఆ ఒప్పందం ప్రకారం కార్మికులతో వ్యవహారం చేసినప్పుడు సమ్మెలకుగానీ, హర్తాళ్ళకుగానీ దిగటం వాంఛనీయం కాదు. అల్లాహ్ తన దివ్య గ్రంథంలో సాటి మనుషులతో చేసుకున్న ఒడంబడికలకు కట్టుబడి ఉండమని ఆదేశిం చారు. ఆయనిలా అన్నాడు:

"ఓ విశ్వాసులారా! ప్రమాణాలను, ఒడంబడికలను నెరవేర్చండి".

(అల్ మాయిద – 1)

సమ్మెలు, హర్తాళ్ళ వల్ల వ్యవస్థలో అరాచకం, విధ్వంసం వంటివి జరిగేందుకు ఆస్కారముంటుంది. పరస్పర సంబంధాలు దెబ్బతిం టాయి. ఉద్రిక్తత నెలకొంటుంది. ఇలాంటి వాటిని షరీయతు వాంఛిం చదు. ఎందుకంటే ధర్మశాస్త్రంలోని ఒక మౌలిక సూత్రం ప్రకారం "ప్రయోజనాలు పొందజూడటం కన్నా చెడుగును దూరం చేయటం మిన్న".

అయితే యజమాని కార్మికుల వేతనాన్ని చెల్లించకుండా ఉన్నప్పుడు కార్మికులు పనిచేసేందుకు నిరాకరించటం ధర్మ సమ్మతమే. ఎందుకంటే ఇక్కడ యజమాని కార్మికునితో చేసుకున్న ఒప్పందానికి విరుద్ధంగా వ్యవహరించాడు. తద్వారా వ్యవస్థకు తూట్లు వేశాడు. కనుక ఇట్టి పరిస్థితిలో తమ జీతాలు అందనంతవరకూ డ్యూటీని పరిత్యజించే హక్కు కార్మికులకు, ఉద్యోగులకు ఉంటుంది. ఎందుకంటే "కూలివాని చెమట ఆరకమునుపే అతని కూలిని ఇచ్చేయండి" అన్నది మానవ మహోపకారి ముహమ్మద్ (స) ప్రవచనం (ఇబ్ను మాజ).

(ముహమ్మద్ మహ్మూద్ అల్ నజ్దీచే సంకలనం చేయబడిన 'రసాయెల్ వ మసాయెల్ ' నుండి)

ధర్మ సందేహాలు

## పీడకల వస్తే ఏం చేయాలి ?

**ప్రశ్న :- నేను 18 ఏండ్ల అమ్మాయిని. నాకు తరచూ పీడ కలలు వస్తూ ఉంటాయి. కలగన్న కొన్నాళ్ళకు అవి వాస్తవ రూపం కూడా ధరిస్తున్నాయి. దాంతో మా కుటుంబీకుల కష్టాలు మొదలవుతుంటాయి. ఇలాంటి భయంకరమైన కల వచ్చినప్పుడల్లా మా ఇంటివారికి చెప్పేస్తూ ఉంటాను. వారు అల్లాహ్ శరణు కోరుతూ ప్రార్థిస్తుంటారు. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి?**

జవాబు :- నిద్రలో భయంకరమైన కలగన్న వ్యక్తి మెలకువ రాగానే ఎడమ ప్రక్కకు తిరిగి మూడుసార్లు ఉమ్మివేయాలి. షైతాను కీడు నుండి మూడు సార్లు అల్లాహ్ శరణు వేడాలి. తరువాత మరో ప్రక్కకు తిరిగి పడుకోవాలి. ఇలా చేసినట్లయితే ఎలాంటి కీడూ జరగదు. ఆ పీడకల గురించి ఎవరికీ చెప్పకూడదు. ఎందుకంటే పీడకలగన్న వారు, దాని గురించి ఇతరులకు చెప్పుకోరాదని ప్రవక్త (స)వారు తాకీదు చేశారు.

ఇకపోతే కలలో శుభ సూచకమైన విషయాలను చూసినవారు "అల్ హందులిల్లాహ్" అంటూ దైవానికి కృతజ్ఞతలు తెలుపుకోవాలనీ ఈ 'మంచి కల' గురించి తమ శ్రేయోభిలాషికి మాత్రమే చెప్పాలని ప్రవక్త (స) వారి ప్రవచనం ద్వారా తెలుస్తోంది.

## నమాజులో తల్లిదండ్రుల కొరకు 'దుఆ' చేయవచ్చా?

**సందేహం: ఫర్జ్ నమాజులో తల్లిదండ్రుల కోసంగానీ, వేరితరుల కొరకుగానీ 'దుఆ' చేయటం సమ్మతం కాదని కొందరంటున్నారు. ఇది నిజమేనా?**

**సమాధానం:** నమాజులో దుఆ – తన కోసం చేసుకున్నా, తన తల్లి దండ్రుల, వేరితరుల కోసం చేసుకున్నా – ఆక్షేపణీయం ఏమీకాదు. "దాసుడు తన ప్రభువుకు అత్యంత సమీపంలో ఉండేది 'సజ్దా' స్థితిలోనే కాబట్టి మీరు (ఆ స్థితిలో) అత్యధికంగా దుఆ చేసుకోండి" అని మహనీయ ముహమ్మద్ (స) వారు ఉపదేశించారు. (ముస్లిం)

ఆయన (సఅసం) ఇంకా ఈ విధంగా ప్రవచించారు; రుకూలో మీ ప్రభువు ఔన్నత్యాన్ని కీర్తించండి. సజ్దాలో మాత్రం అత్యధికంగా వేడుకోలు చేయండి. బహుశా మీ వేడుకోలు ఆమోదించబడవచ్చు.

(ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ (రజి) ఇలా అన్నారు; మహా ప్రవక్త (సఅసం) తనకు తషహ్హుద్ నేర్పిన తర్వాత ఇలా ఉద్బోధించారు – "ఇక నీవు నీకు ఎంతో ఇష్టమైన దుఆను ఎంపిక చేసుకుని దుఆ చెయ్యి. లేదా నీకు కావలసినది కోరుకో (అడుక్కో)" అన్నారు. (బుఖారి, ముస్లిం)

కాబట్టి ఎవరయినా నమాజు ముగించక ముందే సజ్దా స్థితిలో గాని, ఖఇదా స్థితిలోగానీ తన కోసం లేదా తన మాతాపితల కోసం, ఇంకా సమస్త ముస్లిముల కోసం వేడుకుంటే అది అభ్యంతరకరం ఏమీ కాజాలదు. ఇది ధర్మసమ్మతమే.

**–షేఖ్ అబ్దుల్ అజీజ్ బిన్ బాజ్ (రహ్మా.లై)**

మౌలానా సనావుల్లా ఉమ్రి



# కల చెదిరింది... కథ మారింది..

క్షణికావేశంలో హద్దు మీరి క్షణం క్షణం నర కం అనుభవిస్తూ కువైట్‌లో జీవచ్ఛవంలా జీవిస్తున్న ఓ మైగ్రెంట్ కన్నీటి గాథ...

బ్రతుకు తెరువు కోసం స్వదేశాన్ని వదలి వచ్చి క్షణికావేశంలో కాలుజారిన అబలలు కొందరైతే, కాసుల కోసం శరీరాన్ని అమ్ముకుంటూ " మృత్యువైరస్ " ను విరివిగా అంటించే మగువలు మరి కొందరు...

అటు కట్టుకున్న ఇల్లాలినీ, ఇటు కన్న బిడ్డల యోగక్షేమాలను కూడా విస్మరించి ఉంపుడుకత్తెల వలలో చిక్కుకున్న మగ మారాజులు కొందరైతే, కామోద్రేకంలో ఉజ్వల భవిష్యత్తును మరచి ఆనక బాధపడే అభాగ్య యువకులు ఇంకొందరు.

దిన పత్రికల్లోనూ, మ్యాగజైన్ల లోనూ ఇలాంటి కన్నీటి గాధలు కోకొల్లలు – కువైట్‌లోని అరబీ దిన పత్రిక "అల్ ఖబస్" ఇటీవల ఓ అరబ్బేతర మైగ్రెంట్‌ని ఇంటర్వ్యూ చేసి ప్రచురించిన వృత్తాంతాన్ని సంక్షిప్తంగా మన తెలుగు పాఠకుల కోసం ఈ నెల ప్రచురిస్తున్నాం. ప్రవాసాంధ్ర సోదర సోదరీ మణులకు ఇలాంటి సంఘటనలు కను విప్పు కలిగించాలన్నది మా ప్రగాఢ వాంఛ ... ఎడిటర్).



**ప్రశ్న: మీ గురించి చెబుతారా!**

జవాబు: నేను 30 ఏండ్ల నవ యువకుణ్ణి. మంచి ఫామిలీ మాది. నేనిక్కడ ఓ ప్రైవేటు కంపెనీలో జాబ్ చేస్తున్నాను. వివాహితుణ్ణి. ముగ్గురు పిల్లలు. కువైట్‌లో మాత్రం ఒంటరిగా ఉంటున్నాను. నాలుగేళ్ళ క్రితం వచ్చాను. బాగా సంపాదించి పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును ఇవ్వాలనుకున్నాను. మంచి ఇల్లు కట్టాలని కలగన్నాను. కానీ! ఇప్పుడు... నా కల చెదిరింది. కథ మారింది... కన్నీరే ఇక మిగిలింది. నా జీవితం సర్వ నాశనమై పోయింది.

**ప్రశ్న: ఇంతకీ అసలేం జరిగిందో చెబుతారా?**

జవాబు: ఏం చెప్పమంటారు? ఒక రోజు నేను ఓ షాపింగ్ కాంప్లెక్సు వద్ద నిలబడి ఉన్నాను. అక్కడున్న ఓ ఫిలిప్పీనీ యువతిపై నా దృష్టి పడింది. కళ్ళు చెదిరే అందం ఆ యువతిది. ఒంటికి అతుక్కుపోయిన దుస్తులు ధరించి అటూ ఇటూ చూస్తూ పచార్లు చేస్తూంది. నేను చాలాసేపు ఆ అమ్మాయిని తదేకంగా చూస్తూ ఉండిపోయాను.

ఆమె నా వంక చూసి, చిరునవ్వు చిందించింది. కాస్త దగ్గరకు వెళ్ళి "ఏం కావాలి?" అన్నాను. 'రావలసినవారి కోసం ఎదురు చూస్తున్నాను. మీరు నన్నక్కడకు తీసుకెళ్తారా?' అన్నది. ఆ క్షణంలో నేను ఆలోచించే స్థితిలో లేను. మారు మాట్లాడకుండా ఆమెను నా కారులో ఎక్కించుకున్నాను... సంభాషణ మొదలయింది. అడిగిన ప్రతిదానికీ చలాకీగా సమాధానాలిస్తుంది. " నువ్వేం చేస్తావు? " అన్నాను. డబ్బుకోసం ఏం చేయమన్నా చేస్తాను అన్నది నవ్వుతూ. ఆమె ఉద్దేశం గ్రహించాను. మరో వైపు నన్ను నేను నిగ్రహించుకోలేక పోయాను. కామంతో నా కళ్ళు మూసుకుపోయాయి. తిన్నగా ఆమెను నా రూముకు తీసుకెళ్ళాను. కొన్ని నిమిషాల్లోనే ఇద్దరం శారీరకంగా ఏకమయ్యాం.

ఆ క్షణంలో నేను షైతాన్ వలలో ఎలా చిక్కుకున్నానా అని ఇప్పుడు ఏడుస్తున్నాను. చూడబోతే నేను ధార్మిక భావాలు గలవాణ్ణి. ప్రతిరోజు నమాజు చేస్తాను. ఉపవాసాలు ఉంటాను. కాని ఆ సమయంలో నేను వివేకాన్ని కోల్పోయి ఆ అమ్మాయి అందాలకు దాసోహమన్నాను. కథ అంతటితో ఆగలేదు. మూడు రోజుల తర్వాత మరోసారి ఫోన్ చేసి ఓ ప్రత్యేక స్థలంలో ఆమెను పిలిచి, కామ తాపం చల్లార్చుకున్నాను. కొన్నాళ్ళకు నా పురుషాంగంలో మంట మొదలయింది. మూత్ర విసర్జన సమయంలో మరీ బాధగా ఉండేది. మెడికల్ షాపు వారికి విషయం చెప్పి మందులు కొన్నాను. మందులు వాడితే తాత్కాలిక ఉపశమనం కలిగింది. బహుశా ఆ అమ్మాయితో జరిపిన రతి క్రీడ వల్లనే ఈ ప్రాబ్లమ్ వచ్చిందని అనుమానించి ఆమెతో తెగతెంపులు చేసుకున్నాను. ఆమె చాలా సార్లు ఫోన్ చేసింది. ఇక ఎన్నడూ నా మొహం చూడొద్దని తెగేసి చెప్పేశాను. పది మాసాల తర్వాత విచిత్రంగా నా బాధ మళ్ళీ మొదలయింది.

**ప్రశ్న: మొదట ఏ లక్షణాలు కనిపించాయి?**

జవాబు: జలుబు జ్వరంతో బాధ మొదలయింది. వాతావరణంలో వచ్చిన మార్పు ప్రభావం అని అనుకున్నాను. తర్వాత నడుం నొప్పి విపరీతమయింది. అంగంలో నుంచి తరచూ నీరు వచ్చేది. ఆ నీటితోపాటే నుద్దలు పడేవి. డాక్టరును సంప్రదించి మందులు వాడాను. కాని లాభం లేక పోయింది. నా మనసు ఏదో కీడు శంకించింది. మరోసారి హాస్పిటల్‌కి వెళ్ళి వైద్య పరీక్షలు చేయించుకున్నాను. వాళ్ళేమో కిడ్నీల్లో ఇన్‌ఫెక్షన్ ఉందని అనుమానించి మందులు వ్రాశారు. దానివల్ల కూడా ప్రయోజనం లేకపోయింది. ఒల్లంతా పచ్చి పుండుగా మారింది. వేగంగా బరువు తగ్గసాగింది. తొందరగా అలసిపోయేవాణ్ణి. లైంగిక కోర్కె కూడా తగ్గి పోయింది. రాత్రుళ్ళు నిద్ర పట్టేది కాదు. అంచేత వేరొక డాక్టర్ని సంప్రదించాను.

**ప్రశ్న: ఈ బాధంతా ఆ స్త్రీ మూలంగానే నని మీకు అనుమానం రాలేదా?**

జవాబు : వచ్చింది – కాని తమాయించుకునేవాణ్ణి. డాక్టర్లకు కూడా అసలు విషయం చెప్పలేకపోయాను. నిజం బయటపడి,

# ...కన్నీరే ఇక మిగిలింది



నలుగురిలో నవ్వుల పాలౌతానేమోనన్న సంశయంతో స్పష్టంగా చెప్పలేదు.

**ప్రశ్న: ఇంతకీ మీకు 'ఎయిడ్స్' ఉందని ఎప్పుడు తెలిసింది?**

జవాబు: నా బాధ మితిమీరిపోయినప్పుడు, నేను నా స్వదేశానికి వెళ్ళి, నా అన్న గారిని తీసుకుని అక్కడి ఫేమస్ డాక్టర్ వద్దకు వెళ్ళాను. వివరాలు అన్నీ చెప్పాను. ఆయన నా పాత రిపోర్టులు అడిగారు. కాని ఆ రిపోర్టులేవీ లేకపోవటం చేత మళ్ళీ వైద్య పరీక్షలు చేయించారు. రిపోర్టుల్ని పరిశీలించిన మీదట డాక్టర్ నన్ను విచిత్రంగా చూశారు, రకరకాల ప్రశ్నలు వేశారు. ఎక్కడుంటావ్?.. ఏం పనిచేస్తావ్? పరాయి ఆడవాళ్ళతో అక్రమ సంబంధాలేమైనా పెట్టుకున్నావా?...

అంతే ... నాకర్థమైపోయింది... "సార్! నాకు ఎయిడ్స్ రోగం ఉందా డాక్టర్!.. చెప్పండి డాక్టర్! ఇప్పటికే నరకం అనుభవించాను డాక్టర్! నాలో ఇక శక్తిలేదు డాక్టర్!" అంటూ విలవిల్లాడాను.

"అవును... నీకు ఎయిడ్స్ ఉంది".

నా ముఖం పాలిపోయింది. నా కాళ్ళ క్రింద నేల కదలసాగింది. ఒక్కసారిగా నా శరీరంలో నిస్సత్తువ ఆవరించింది. నా అన్న గారు నన్ను కౌగిలించుకుని వెన్ను తట్టుతున్నారు. నేను చిన్న పిల్లాడిలా ఏడుస్తున్నాను. ఆ క్షణంలో మృత్యువు నా కళ్ళ ముందు కదలాడింది.

**ప్రశ్న: డాక్టర్‌ని సంప్రదించక ముందు మీరు మీ ధర్మపత్నితో సంభోగించారా?**

జవాబు: లేదు. నా మనసాక్షి నన్ను ఆమెను సమీపించకుండా ఆపింది. ఎందుకంటే నా రోగ నిర్ధారణ జరిగే వరకూ ఆమెతో శారీరక సంబంధం ఏర్పరచుకోరాదని గట్టిగా సంకల్పించుకున్నాను.

**ప్రశ్న: ఇప్పుడు మీరు పరిస్థితుల్ని ఎలా ఎదుర్కొంటున్నారు?**

జవాబు: క్రమ క్రమంగా తేరుకున్నాను. నన్ను నేను అదుపులో పెట్టుకున్నాను. కానీ చాలా వీక్ అయిపోయాను. మునుపటిలా కష్టపడలేను. ఇంటికి వెళ్ళలేను. ఇంటికెళ్ళి ఇల్లాలి నుండి తప్పించుకొని తిరగలేను. కుటుంబీకులకు మొహం చూపెట్టలేను. ఇల్లాలు నిలదీసి అడిగితే ఏం చెప్పను? ఆత్మీయులు రకరకాలుగా అనుమానించవచ్చు. ఇక్కడే ఏడుస్తూ జీవచ్ఛవంలా గడపటం తప్ప మార్గాంతరంలేదు. నా స్వయంకృతానికి ఈ శాస్తి తప్పదు.

**ప్రశ్న: ఈ వైరస్ చాలా ప్రమాదకరమన్న సంగతి మీకు తెలుసా? ఇది ఏండ్ల తరబడి ఉంటుంది. (దేవుడు మీకు స్వస్థతను ప్రసాదించుగాక!) మరి మీరు దీనిని అధిగమించ గలననుకుంటున్నారా?**

జవాబు: జీవన్మరణాలు అల్లాహ్ చేతిలో ఉన్నాయన్నది నా విశ్వాసం. అల్‌హందు లిల్లాహ్ నేనొక ముస్లింని. నా వ్యవహారమంతా ఆ ప్రభువు ఆధీనంలో ఉంది. నేను అబద్ధాలు చెప్పను. నా ప్రభువు నన్ను మన్నించి వీలైనంత తొందరగా లేపుకోవాలని కోరుకుంటున్నాను. నా తప్పులు జనులకు తెలియకుండా ఉండాలన్నది నా వాంఛ.

**ప్రశ్న: అంటే, మీ సంబంధీకులకు కూడానా?!**

జవాబు: అవును. ఒక్క అన్నగారికి తప్ప ఎవరికీ ఈ సంగతి తెలీదు. నేను చచ్చిపోయాక కూడా ఆయన ఎవరికీ చెప్పరని నా నమ్మకం.

**ప్రశ్న: మీ ఇల్లాలికి కూడా ఈ నిజం చెప్పరా?**

జవాబు: చెప్పకూడదనే నిశ్చయించుకున్నాను. చెబితే ఆమె దృష్టిలో నీచుణ్ణి అయిపోతాను. ఆమె నన్నెంతో గౌరవిస్తుంది. మరోవైపు నేను సమాజానికి భయపడుతున్నాను. నాకే గనక ఎయిడ్స్ ఉందని తెలిస్తే జనులు నా నుండి పారిపోతారు. నా పిల్లలను చిన్న చూపు చూస్తారు. స్కూల్లో నా పిల్లలను ఎగతాళి చేస్తారు. ఈ అవమానాన్ని నా పిల్లలు భరించలేరు.

**ప్రశ్న: జరిగిన దానిపై మీరు ప్రాయశ్చిత్తం చేసుకుంటున్నారా?**

జవాబు: సిగ్గుతో కుంచించుకు పోతున్నాను. ఎన్నో సార్లు ఆత్మ నింద చేసుకున్నాను. సౌందర్యవతి, శీలవతి అయిన ధర్మపత్ని ఉండగా నేను ఎంగిలి విస్తరాకు కోసం ఎందుకు ఎగబడ్డానా? అని పదే పదే ప్రశ్నించుకుంటున్నాను. జరిగినదంతా ఓ పీడకల అయి ఉంటే బావుండునే అని అన్పిస్తోంది. నేను ఇంటి కెళ్ళినపుడు నా ఆస్తిపాస్తులన్నింటినీ భార్యా పిల్లల పేర వ్రాసి వచ్చాను. వారన్నా ఎలాంటి చీకూచింతా లేకుండా బ్రతకాలన్నది నా కోరిక.

దేవుడు నాకన్నీ ఇచ్చాడు. అర్థాంగి ఉంది. ఆస్తి ఉంది. సంతానం వుంది. ఈ దైవానుగ్రహాలపై నేను కృతజ్ఞుడినై ఉండాల్సింది. కాని మాయలమారి షైతాను నన్ను వంచించాడు. నా చేత చేయరాని పని చేయించాడు. ఇప్పుడు శిక్ష అనుభవిస్తున్నాను.

**ప్రశ్న: ఈ జబ్బుకు గురైనాక మీలో వచ్చిన మార్పేమిటి?**

జవబు: ఏకాంతాన్ని ఇష్టపడుతున్నాను. ఫ్రెండ్స్‌తో కలిసి తిరిగే ఆలోచన ఉండదు. ఏకాంతంలో ఖుర్‌ఆన్ పారాయణం చేస్తూ, ఇంటర్నెట్‌లో ఈ జబ్బుకు సంబంధించిన మెడిసిన్స్‌ను గురించి వాకబు చేస్తూ ఉంటాను. ఈ రోగం మందులతో నయం అయ్యేది కాదని నాకు తెలుసు. అయితే చావు మాత్రం నా ఇంటివారి మధ్యనే రావాలన్నది నా ఆకాంక్ష.

**ప్రశ్న: ఇంతకీ మీరీ వృత్తాంతాన్ని మాకెందుకు తెలిపారు?**

జవాబు: నా జీవితం అందరికీ ఓ గుణపాఠం కావాలనుకున్నాను. ముఖ్యంగా యువతీ యువకులు లైంగిక విశృంఖలత్వం వల్ల పొడసూపే ప్రమాదాలను గురించి ఆవేశంలో పట్టించుకోరు. నా బాధే నా కళ్ళు తెరిపించింది. ఈ నరక యాతన ఇతరులెవరికీ సోకవద్దని కోరుకుంటున్నాను.

**ఆఖరిమాట:**

చివర్లో నేను చెప్పేదొక్కటే – నాలాంటి వారు క్షణికావేశంలో తప్పు చేసేస్తారు. తర్వాత బాధపడతారు. కాని అప్పటికే సమయం మించిపోతుంది. ఇలాంటి పాడు పని కోసం మనసు పురికొల్పినప్పుడు యువకులు వెయ్యిసార్లు ఆలోచించాలి. వారిపై ఎందరో ఆధారపడి ఉంటారు. కన్న తల్లి తండ్రులు, కట్టుకున్న ఇల్లాలు, రక్తం పంచుకు పుట్టిన తోబుట్టువులు ... ఇలా ఎందరో వారిపై గంపెడాశలతో జీవిస్తుంటారు. ఈ ఆశా దీపాలు ఆరిపోకూడదు..... ఆరిపోకూడదు.

హాఫిజ్ ఎస్.ఎమ్ రసూల్



# నమాజ్ మేరాజ్ కానుక

**నమాజు ప్రాముఖ్యం:** దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇహలోకం వదలి వెళ్తున్నప్పుడు కూడా జీవితపు చివరి శ్వాస వరకు తన అనుచర సమాజానికి నమాజ్ గురించి తాకీదు చేశారు.

### ప్రళయ దినాన తొలి ప్రశ్న నమాజు గురించే...

ఆయన ఇలా తెలిపారు: ప్రళయ దినాన దాసుణ్ణి దేవుడు అన్నింటికన్నా ముందు నమాజ్ గురించి గట్టిగా ప్రశ్నించడం జరుగుతుంది. అది సరిగ్గా ఉంటే మిగిలిన ఆచరణలన్నీ సరిగ్గా ఉంటాయి. అది సరిగ్గా లేకపోతే మిగిలిన ఆచరణలు కూడా సరిగ్గా ఉండవు. (తబ్రానీ)

నమాజు వదలిపెట్టే వారిని హెచ్చరిస్తూ దైవప్రవక్త (స) ఇలా అన్నారు: ముస్లిం దాసునికి – దైవ తిరస్కారానికి మధ్య భేదం నమాజు వదలి పెట్టడమే.

### పిల్లల్ని బాల్య దశ నుంచే నమాజుకై ప్రోత్సహించాలి.

అందుకే దైవప్రవక్త (స) చిన్న పిల్లల్ని బాల్య దశ నుంచే నమాజుకు అలవాటు చేయాలని బోధించారు. తన అనుచరులకు ఈ విషయం గురించి చెబుతూ ఆయన, "మీ పిల్లలు ఏడు సంవత్సరాల వయసుకు చేరుకోగానే వారిని నమాజ్ చేయమని ఆదేశించండి. పదేళ్ల వయసుకు చేరుకున్న తర్వాత (నమాజ్ చేయకపోతే) వారిని దండించండి. ఇంకా ఆ వయసులో వారిని వేర్వేరు పడకల మీద పడుకోబెట్టండి" అని బోధించారు. (అబూ దావూద్)

### అస్ర్ నమాజ్ వదలి పెట్టడం మహా దౌర్భాగ్యం

హజ్రత్ అబ్దులాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "అస్ర్ నమాజ్ వదలి పెట్టినవాడు తన ఆలుబిడ్డల్ని, సిరిసంపదల్ని, జీవన సామగ్రిని పోగొట్టుకున్నట్లే".

(బుఖారీ-ముస్లిం)

### వ్యాధిగ్రస్తులైనా సరే నమాజ్ చేయాలి

హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం: నాకు మొలల వ్యాధి ఉండేది. "ఈ స్థితిలో నేను నమాజ్ ఎలా చేయాలి?" అని నేను దైవ ప్రవక్త (స)ను అడిగాను. అందుకాయన "నిలబడి నమాజ్ చేయగలిగితే చెయ్యి. లేకపోతే కూర్చొని చెయ్యి. కూర్చొని కూడా చేయలేకపోతే పడుకొని చెయ్యి" అని చెప్పారు.

(బుఖారీ-అబూదావూద్)

వ్యాధిగ్రస్తులు కూడా తమకు ఏ విధంగా అనుకూలంగా ఉంటుందో ఆ విధంగా నమాజ్ చేయాలిగాని, అకారణంగా నమాజ్‌ను వదలిపెట్టకూడదని పై హదీసు ద్వారా బోధపడుతుంది. ఇస్లాం ధర్మం నమాజ్‌కు ఎంతటి ప్రాముఖ్యం ఇచ్చిందంటే స్వంత ప్రదేశంలోగాని, ప్రయాణంలో ఉన్నప్పుడుగాని, శాంతిభద్రతల వాతావరణంలోగాని, భయాందోళనల పరిస్థితిలోగాని- ఎట్టి పరిస్థితిల్లోనయినా నమాజ్ చేయడం తప్పదని ఖరారు చేసింది. నమాజును నిర్లక్ష్యం చేసేవారిని, నమాజ్ పట్ల ఏమరుపాటు వహించేవారిని తీవ్రంగా హెచ్చరించింది.

### నమాజ్‌ను తిరస్కరించేవాడు ముస్లింగా మిగలడు.

పూర్వపు సమాజాలు నాశనమైపోవటానికి ఓ ముఖ్య కారణం నమాజును వదలిపెట్టడమేనని దివ్యఖుర్‌ఆన్ చెబుతుంది. నమాజ్ చేయడం విధి అన్న విషయాన్ని త్రుణీకరించేవాడు ఇస్లాం పరిధి నుండి వైదొలిగిపోతాడు. ఈ విషయమై యావత్తు ముస్లిం సమాజం ఏకాభిప్రాయంతో ఉంది.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా తెలియజేశారు: ఖుర్‌ఆన్‌ను కంఠపాఠం చేసుకున్న తర్వాత మరచిపోయేవాడి తలను, ఫర్జ్ (విధి) నమాజ్ చేయకుండా పడుకునేవాడి తలను ప్రళయ దినాన రాళ్ళతో చితక్కొట్టడం జరుగుతుంది. (బుఖారీ)



### ఇషా, ఫజ్ర్ నమాజులు కపటులకు భారం

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా అన్నారు: ఇషా (రాత్రి) మరియు ఫజ్ర్ (ఉదయపు) నమాజులను పాటించటం కపట విశ్వాసులకు చాలా భారంగా తోస్తుంది. కాని ఈ నమాజులకు ఎంత పుణ్యం లభిస్తుందో వారికి గనక తెలిస్తే మోకాళ్ళు ఈడ్చుకుంటూ నయినా వారు నమాజ్‌కు వస్తారు. (బుఖారీ వ- ముస్లిం)

## సీరత్ క్విజ్



షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయి

**ప్రశ్న: అల్లాహ్ పట్ల విశ్వాసం అంటే ఏమిటి?**

జ: అల్లాహ్ పట్ల విశ్వాసం అంటే అల్లాహ్‌యే సమస్త సృష్టి యొక్క ప్రభువు, మరియు సృష్టికర్త ఆయనే అని విశ్వసించడంతోపాటు ఆయన పట్ల దృఢమైన నమ్మకం కలిగి ఉండటం. ఒక్కడైన అల్లాహ్ మాత్రమే అన్ని రకాల పూజలకు, ప్రార్థనలకు, ఆరాధనలకు అర్హుడని, అన్ని రకాల పవిత్రమైన సంపూర్ణ గుణవిశేషాలు కలవాడనీ, ఎటువంటి అసంపూర్ణత, కొరత, వెలితి, లోపం లేనివాడు కేవలం అల్లాహ్‌యేనని విశ్వసించడం, దానికి కట్టుబడి ఉండటం, దాని ప్రకారం అమలు చేయడం అని అర్థం.

**ప్రశ్న: దైవదూతలంటే?**

జ: దైవదూతలు నూర్ (వెలుగు, కాంతి)తో సృష్టించబడ్డారు. అల్లాహ్ వారికిచ్చిన ఆజ్ఞలను తు.చ తప్పకుండా అమలు చేసే పరమ విధేయులు.

**ప్రశ్న: దైవగ్రంథాలు, దైవప్రవక్తలపై విశ్వాసం అంటే ఏమిటి?**

జ: అల్లాహ్ తన ప్రవక్తలను కాలానుగుణంగా విశ్వ ప్రజల మధ్య తనయొక్క ఆజ్ఞలను స్థాపించటానికి పంపించాడు. వారిపై గ్రంథాలను అవతరింపజేశాడు. ప్రవక్తలలో అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స). గ్రంథాలలో అంతిమ గ్రంథం ఖుర్ఆన్ అని విశ్వసించడం.

**పశ్న: అంతిమ దినంపై విశ్వాసమంటే ఏమిటి?**

జ: అంతిమ దినం అంటే పునరుత్థాన దినం. ఆ దినము ఈ ప్రపంచానికి అంతిమ దినము. ఆ దినము తరువాత మరే దినమూ లేదు. ఆ దినమున అందరి లెక్కలు తీసుకోబడతాయి. దాసుల కర్మలకు ప్రతిఫల దినమది. స్వర్గవాసులు స్వర్గంలో నరకవాసులు నరకంలో స్థిరపడే దినమది.

**పశ్న: అంతిమ దినాన దేవుని శిక్ష నుండి తప్పించుకునే మార్గమేది?**

జ: అల్లాహ్‌ను విశ్వసించి, ఖుర్ఆన్ మరియు దైవప్రవక్త (స) విధానం ప్రకారం ఆచరిస్తూ జీవించడం.

**పశ్న: ఈ రుజు మార్గంపై జీవించాలంటే ఏం చేయాలి?**

జ: 'లా ఇలాహ ఇల్లల్లాహ్, ముహమ్మదుర్రసూలుల్లాహ్' (అల్లాహ్ తప్ప నిజ ఆరాధ్య దేవుడెవరూ లేరు, ముహమ్మద్ (స) అల్లాహ్ ప్రవక్త) అని సాక్ష్యమిచ్చువారు చూపించిన విధానం ప్రకారం జీవించాలి.

# ప్రవక్త పిలుపు వింటూ...

శాంతి ప్రియ

దైవప్రవక్త పిలుపు వింటూ
విశ్వాసులంతా కదలవలెనోయ్
లోకమంతా తిరిగి తిరిగి
మానవత్వ పరిమళం పంచవలెనోయ్

హరిజనులెవరు? గిరిజనులెవరు?
అస్పృశ్యులెవరు? అంటరానివారెవరు?
దేవుడు చేసిన దాసులందరూ
ధర్మప్రియులు, శాంతికాముకులు

వర్ణ భేదం, వర్గ వైషమ్యం
భాషా దురభిమానం, ప్రాంత భేదం
అన్నింటిని రూపుమాపి
మానవత్వం ఇంట నిలిపి
దైవ దాసులమనీ
అందరం సమానులమని
నిమ్నోన్నత అన్నదే లేదని
చాటవలెనోయ్ - పాడవలెనోయ్

హెచ్చుతగ్గుల చిచ్చునార్పి
స్వార్థ, సంకుచితను కూల్చివేసి
మూసా, ముహమ్మద్‌ల ధ్యేయపథమున
శాంతి మార్గమున నడవవలెనోయ్

ఊరు ఉంది. వాడ ఉంది
అమ్మ ఉంది. బొమ్మ ఉంది
దేశం ఉంది. లోకం ఉంది
ప్రేమిద్దాం సౌమనస్యాన్ని
వదిలేద్దాం వైమనస్యాన్ని



# మర్యమ్ కుమారుడగు యేసు శిలువపై మరణించారా?



సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ

**ఏ శిక్షనైతే** - మన కొరకు పాప విమోచనం అని భావిస్తున్నామో దానికి సంబంధించిన అసలు ఆధారం ఏమిటి? నిజంగా ఏసు మన పాప విమోచనకై శిలువ మరణం పొందారా? లేక మనకుగా మనమే ఊహాగానాలు చేసుకొని మన పాపాలన్నీ ఏసే భరించారన్న భ్రాంతిలో జీవిస్తున్నామా? అని మనల్ని మనం ప్రశ్నించుకున్నట్లయితే యదార్థం మన ముందుకు వస్తుంది. యూదులు ఏసును ఏదో ఒక నెపంతో చంపాలని యత్నించారు. రాజ ద్రోహిగా చిత్రీకరించి, ఆయన్ను బంధించి, తప్పుడు అభియోగాలు మోపి శిలువ శిక్ష పడేటట్లు చేశారు అన్నది సువార్తలు చదివిన ప్రతి ఒక్కరికి ఇట్టే అర్థమవుతుంది. అయితే "నన్ను పంపినవాడు నాకు తోడైయున్నాడు; ఆయనకిష్టమైన కార్యము నేనెల్లప్పుడును చేయుదును. గనక ఆయన నన్ను ఒంటరిగా విడిచిపెట్ట లేదని చెప్పెను" (యోహాను-8:29) అన్న ఏసు వారి మాట ప్రకారం దేవుడు ఆయన్ను రక్షించాడా? లేదా? అన్నదే అసలు పాయింటు. దీనికి జవాబుగా ఖుర్ఆన్ ఇలా సమాధానం ఇస్తుంది.

"వారు (యూదులు) తమ అవిశ్వాస వైఖరిలో మరింత ముందుకుపోయి మర్యం మీద ఘోరమైన అపనింద మోపారు. పైగా వారు 'మేము నిశ్చయంగా మర్యం కుమారుడగు ఈసా మసీహ్ దైవప్రవక్తను చంపేశాము' అని చెప్పసాగారు. (వాస్తవం ఏమిటంటే) వారసలు ఆయన్ను చంపనూ లేదు. శిలువపై ఎక్కించనూ లేదు. ఆ విషయం వారికి సందేహాస్పదంగా చేయబడింది. మరెవరయితే ఆయన విషయంలో వాగ్వివాదాలకు పూనుకుంటున్నారో, విభిన్న అభిప్రాయాలు వెలిబుచ్చుతున్నారో వారు కూడా అనుమానంలోనే పడిపోయారు. ఊహాగానాల్నీ అనుసరించడం తప్ప దాని (ఆ సంఘటన, వాదన) గురించి వారి దగ్గర ఎలాంటి జ్ఞానం లేదు. నిజంగా వారు ఆయన్ను చంపలేదు. అల్లాహ్ ఆయన్ను తన వైపునకు ఎత్తుకున్నాడు. అల్లాహ్ సర్వ శక్తిమంతుడు, అత్యంత వివేకవంతుడు." (నిసా:156-158)

మరో చోట ఇలా ఉంది: "సత్యాన్ని తిరస్కరించినవారు (ఈసాను చంపడానికి) పన్నాగాలు పన్నారు. అల్లాహ్ (ఈసాను కాపాడేందుకు) ఓ యుక్తి పన్నాడు. అల్లాహ్ అందరికన్నా గొప్ప యుక్తిపరుడు".

(ఆలి ఇమ్రాన్: 54)

'అప్పుడు అల్లాహ్ ఇలా అన్నాడు: "ఈసా! నేనిప్పుడు నిన్ను నా దగ్గరికి రప్పించుకుంటాను. నా వైపునకు ఎత్తుకుంటాను. నిన్ను ధిక్కరించినవారి (దుష్ట పరిసరాల) నుండి (తీసి) నిన్ను పావనం చేస్తాను".

(అలి ఇమ్రాన్: 55)

ఇక పవిత్ర ఖుర్ఆన్‌లో పేర్కొనబడిన ఈ యదార్థాన్ని సువార్తల వెలుగులో గ్రహిద్దాం! 'యేసు మా అందరి పాప పరిహారంగా తన్ను తాను శిలువ మరణం పొంది - సమాధి అయిన మూడు రోజుల తర్వాత మృతులలో నుండి లేచి, శిష్యులకు కనబడిన తర్వాత ఆకాశరోహనుడై దేవుని కుడి పార్శ్వమున కూర్చుండెను' అని విశ్వసించే వారి నమ్మకంలో ఎంత వరకు నిజం ఉందో తెలుసుకుందాం.

1) ఏసు ఇష్టపూర్వకంగా (తనకు తాను) శిలువపై మరణించడానికి సిద్ధమయ్యారా? అంటే- 'కాదు, ముమ్మాటికి కాదు' అని చెప్పవచ్చు. అందుకు స్వయంగా ఏసు వారి మాటలే సాక్షి. "అప్పుడు యేసు - మరణమగునంతగా నా ప్రాణము బహు దుఃఖములో మునిగియున్నది".

(మత్తయి-26:37)

"నా తండ్రీ! (దేవా!), నేను దీనిని (మృత్యువును) త్రాగితేగాని ఇది నా యొద్ద నుండి తొలిగిపోవుట సాధ్యము కాని ఎడల, నీ చిత్తమే సిద్ధించుగాక" (మత్తయి-26)

"నా తండ్రీ, సాధ్యమైతే ఈ గిన్నె (మృత్యువు) నా యొద్ద నుండి తొలగిపోనిమ్ము. అయినను నా ఇష్టప్రకారము కాదు నీ చిత్తప్రకారమే కానిమ్మ"ని ప్రార్థించెను. (మత్తయి-26)

**ముఖ్యాంశాలు:**

అ) ఏసు దుఃఖ పడటం, చింతించడం మొదలుపెట్టారు.

ఆ) ఎంతగా చింతించారంటే - చావు రాక పూర్వమే మరణం పొందినంతగా దుఃఖంలో మునిగిపోయారు.

ఇ) ఇంతటి క్లిష్ట పరిస్థితిలో ఆయన ఏమని ప్రార్థించారంటే - 'దేవా! నన్ను ఈ మరణం నుంచి రక్షించు' అని వేడుకున్నారు. అనగా ఏ శిలువ మరణాన్ని క్రైస్తవ సోదరులు తమ పాప విమోచనగా భావిస్తున్నారో - ఆ శిలువ మరణం నాకు వద్దు - నన్ను ఈ మరణం నుండి తప్పించమని ఏసు వారు ప్రాధేయపడ్డారు. మనం పైన తెలుసుకున్నట్లు దేవుడు ఆయన్ను కాపాడాడు.

2) **'సమాధి అయి-'** అంటే ఆ సమాధి ఎటువంటిది? అసలు ఏసువారికి మరణం సంభవించిందా? అంటే- కాదు అన్నది సరయిన సమాధానం.

అ) "సైనికులలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కన పొడిచెను. వెంటనే రక్తమును, నీళ్ళును కారెను". (యోహాను- 19:34) రక్తం కారింది అంటే ఏసు అప్పటికింకా మరణించలేదు అని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఎందుకంటే మృతదేహం నుండి రక్తం కారదు-గడ్డ కట్టి ఉంటుంది. స్పృహ తప్పి ఉన్న ఏసును ప్రజలు చనిపోయారనుకున్నారు. అందుకే ఏసు మరణించారంటే పిలాతు నమ్మలేకపోయాడు.

"పిలాతు - ఆయన ఇంతలోనే చనిపోయెనా? అని ఆశ్చర్యపడి ఒక శతాధిపతిని తన యొద్దకు పిలిపించి - ఆయన ఇంతలోనే చనిపోయెనా? అని అడిగెను". (మార్కు- 15:44)

ఆ) సమాధి అనగానే సాధారణంగా 4 లోతు x 2 వెడల్పు x 6 పొడవు గల గొయ్యిగా భావిస్తాము. కాని ఏసును

ఉంచిన గది అంత ఇరుకైనది కాదు. అది ఒక రాతితో తొలిచిన గది. అది అప్పటికప్పుడు తొలిచింది కాదు. అది ఒక తోటలో గల సమాధి. అందులోనే ఏసును (దాచి) పెట్టారు. ఆ సమాధి ఎంత పెద్దదంటే దాన్ని సమాధి అనడంకన్నా చిన్న గృహం అనవచ్చు. ఎందుకంటే అందులో ఏక సమయంలో ఏడుగురు ప్రవేశించారు గనక. చూడండి- "ఆదివారమున తెల్లవారు చుండగా (స్త్రీలు) తాము సిద్ధపర్చిన సుగంధ ద్రవ్యములను తీసుకొని సమాధి యొద్దకు వచ్చి సమాధి ముందర ఉండిన రాయి దొరలింప బడియుండుట చూచి లోపలికి వెళ్ళిరి". (లూకా- 24:1,2)

1) మగ్దలేనె మరియ 2) యోహన్న 3) యాకోబు తల్లియైన మరియ 4) వారితో ఉన్న ఇతర స్త్రీలు. ఇతర స్త్రీలని రెండుగా భావిస్తే వారు ఐదుగురు. అక్కడున్న ఇద్దరు మనుష్యులు కలిపి మొత్తం ఏడుగురు అయ్యారు. అంటే మనం అనుకొన్నట్టు అది ఇరుకైన సమాధి కాదు, అదో చిన్న ఇల్లు అని ఈ పాటికే అర్థమయి ఉంటుంది. అనగా ఏసువారిని సమాధిలో పాతి పెట్టలేదు, దాచిపెట్టారని తెలుస్తుంది.

2) **'మూడు రోజుల తర్వాత మృతులలో నుండి లేచి-'** ఈ మాట ఎంత వరకు సమంజసమో చూద్దాం. "సజీవుడైన వానిని మీరెందుకు మృతులలో వెదుకుచున్నారు?"

అ) ఏసు వారి కోసం వాడినవి ప్రేత వస్త్రములు (GRAVECLOTHES) కావు. అంగడిలో కొన్న 'CLEAN LINEN CLOTH' శుభ్రమైన సన్నపు నారబట్ట.

(మత్తయి- 27:59)

ఆ) **'నార బట్టతో చుట్టి సమాధిలో పెట్టారు'** అంటే- శవ సంస్కారాలు జరిగిపోయా యనేగా అర్థం. మరి **"సమాధి చేసిన తర్వాత తిరిగి వెళ్ళి సుగంధ ద్రవ్యములను, పరిమళ తైలములను సిద్ధపర్చి"** (లూకా- 23:56) అలా ఎందుకు సిద్ధపర్చారు? **'యూదులు పాతిపెట్టు మర్యాద చొప్పున'** అన్న (యోహాను- 19:40) మాటకు అర్థం ఏమిటి?

3) **నికోదేము యేసు వద్దకు రాత్రి వేళ ఎందుకొచ్చినట్టు?** బోళముతో కలిపిన 150 సేర్ల అగరు ఎందుకు తెచ్చినట్టు? శిలువపై నుండి దించిన వెంటనే నారబట్ట ఎందుకు చుట్టినట్టు?

ఇక ఏసుగారి కోసం ఉపయోగించబడిన వస్తువులను పరిశీలించండి-

(ఇంకా ఉంది)

# హేతువు సత్యానికి సేతువు

**తెలివి-** అది దేవిని వరప్రసాదం. వివేచన, విచక్షణా జ్ఞానం, విజ్ఞత - మనిషి తెలివి ఎన్ని కోణాలు! ఎన్నెన్ని రూపాలు!!

బుద్ధిజ్ఞానాలలో అసమానుడయిన మానవుడు ప్రకృతిలో ఆవిష్కరించని కోణాల్లేవు; అన్వేషించని క్షేత్రాల్లేవు. తెలివి ఆధారంగా తాను కనుగొన్న సిద్ధాంతాలు అనేకం, అవలంబించిన ఆచారాలు అసంఖ్యాకం, స్థాపించిన సంప్రదాయాలు అగణ్యం, ప్రవేశపెట్టిన ప్రణాళికలు అనన్యం. కానీ, మనిషి మానసిక తృష్ణ తీరలేదు. ఆత్మ ఆవేదనా జ్వాల ఆరలేదు. సత్యార్తి తీరలేదు. ఒక్కోసారి మనిషిలోని ఈ అసంతృప్తి, అశాంతిని చూసి అసమాన విజ్ఞానం, ప్రజ్ఞా పాటవాలు గల మనిషి స్థితేనా ఇది? అని ఆశ్చర్యం వేయక మానదు. కారణం: ఏ భావాలు సరయినవో, ఏ నమ్మకాలు సవ్యమైనవో, ఏ ప్రవర్తన మేలైనదో, ఏ పద్ధతి శ్రేయస్కరమైనదో తెలుసుకోగలిగే ఇంగిత జ్ఞానలేమి.

మనుషులు నాలుగు రకాలు: 1) **సామాన్యులు** - వీరు ఎవరేం చెప్పినా ఇట్టే నమ్మేస్తారు. ఎందుకు?ఎలా? అని ఆలోచించరు. 2) **తెలివైనవారు-** వీరు ప్రతీ దాంట్లో హేతువు ఉన్నదా లేదా? ఇదెలా సాధ్యం? అని తర్కిస్తారు. 3) **మేధావులు-** వీరు తమకు తెలియని హేతువు కూడా ఉండొచ్చు కదా, మనకు తెలిసిందే సరయినదనుకోవడం దేనికి? అని ఆలోచిస్తారు. 4) **జ్ఞానులు-** వీరు హేతువుకు మించి తమకుగానీ, ప్రజలకుగానీ, ప్రపంచానికిగాని ఆ పనివల్ల వచ్చే ఉపయోగం గురించి ఎక్కువ పరిశీలిస్తారు. అంటే- తార్కికంగా (LOGIC) ఆలోచించకుండా పని చెయ్యటాన్ని అజ్ఞానం (STUPIDITY) అంటారు. స్టుపిడిటీ అంటే మంచీ చెడుల, ధర్మాధర్మాల, సత్యాసత్యాల, న్యాయాన్యాయాల, ఉచితానుచితాల ఇంగిత జ్ఞానం లేకపోవటం!! ఇంగిత జ్ఞానం (COMMONSENSE) లేకుండా కేవలం అవతలివారు (తాతముత్తాతలు, తల్లిదండ్రులు) చేసిందే తనూ చేయడం మూర్ఖత్వం, అజ్ఞానం. ఫలితం శూన్యం. కాబట్టి తెలివితోపాటు విచక్షణా జ్ఞానం ఎంతో అవసరం అని ఆకాశ గ్రంథాలు ఘోషిస్తున్నాయి. దాన్నే అరబీలో హిక్మహ్ అంటారు.

ఖుర్ఆన్‌లో ఇలా ఉంది: "విశ్వసించిన జనులారా! మీరు గనక అల్లాహ్ పట్ల భయభక్తుల వైఖరి అవలంబిస్తే ఆయన మీకు మంచీ చెడుల విచక్షణా జ్ఞానం ప్రసాదిస్తాడు; మీలో ఉన్న చెడులను తొలగిస్తాడు; మీ తప్పులను మన్నిస్తాడు. అల్లాహ్ అపార దయామయుడు". (అన్‌ఫాల్: 29)

(అల్లాహ్) తాను తలచుకున్న వారికి వివేకం, విచక్షణా జ్ఞానం ప్రసాదిస్తాడు. వివేకం, విచక్షణల జ్ఞానం లభించినవాడు ఎంతో సౌభాగ్యవంతుడు. నిజంగా అతనికి అపార సంపదలు లభించినట్లే. బుద్ధిమంతులు మాత్రమే గుణపాఠాన్ని గ్రహిస్తారు". (బఖరా: 269)

ఇతర గ్రంథాల్లోని అంశం: "వారు ఆలోచన లేని జనము. వారిలో వివేచన లేదు. వారు జ్ఞానము తెచ్చుకొని దీని తలపోసి తమ కడవరి స్థితిని యోచించుట మేలు".

(ద్వితీయోపదేశకాండము- 32:28,29)

ఆలోచన లేనిది వివేకము లేదు. వివేకము లేనిది జ్ఞానము కాదు. చూడండి! దేవుడిలా అనెను: "జ్ఞానము లేనివారలారా, జ్ఞానము ఎట్టిదైనదని తెలుసుకొనుడి. బుద్ధిహీనులారా! బుద్ధి ఎట్టిదైనది యోచించి చూడుడి. నేను శ్రేష్ఠమైన సంగతులను చెప్పెదను వినుడి. నా పెదవులు యదార్థమైన మాటలు పలుకును. నా నోరు సత్యమైన మాటలు పలుకును. దుష్టత్వము నా పెదవులకు అసహ్యము. నా నోటి మాటలన్నీ నీతి గలవి. వాటిలో మూర్ఖతయైనను కుటిలతయైనను లేదు. అవియన్నియు వివేకికి తేటగాను, తెలివినొందినవారికి యదార్థముగాను ఉన్నవి. వెండికి ఆశ పడక నా ఉపదేశము అంగీకరించుడి".

(సామెతలు - 8:5-10)

ఇన్ని వివరాలు చదివాక కూడా 'విశ్వాసం మేధకు అందనిది, హేతువుకు అర్థం కానిది' అని చెప్పడం ఎంత వరకు సమంజసం? ఈ మాట ఏ ప్రవక్త నోటనైనా మీరు విన్నారా?

# IPC ఆధ్వర్యంలో ఉమ్రా యాత్ర







IPC సందేశ విభాగం అధిపతి షేఖ్ జాసిమ్ సాలెహ్ పర్యవేక్షణలో వివిధ భాషావర్గాలకు చెందిన 60 మంది న్యూ ముస్లిం సోదరసోదరీమణులు ఈ ఏడాది ఉమ్రా విధులను నెరవేర్చుకుని క్షేమంగా తిరిగి వచ్చారు.

2009 మే 20వ తేదీ నుండి 27వ తేదీ వరకు జరిగిన ఈ శుభప్రదమైన యాత్రలో 23 మంది తెలుగు సోదర సోదరీమణులు ఉన్నారు. తెలుగువారికి ఐపిసి దాయి షేఖ్ ముహమ్మద్ బిలాల్, దాయియా తాహిరా బేగం సారథ్యం వహించగా, హిందీవారికి మౌలానా ఏజాజుద్దీన్ ఉమ్రీ నాయకత్వం వహించారు. తమిళ సింహళీయులకు షేఖ్ అమీర్ హసన్, షిహోమాలు నేతృత్వం వహించారు. ఈ శుభ సందర్భంగా ముజ్దలిఫా, అరఫాత్, జబలె రహ్మ, జబలె నూర్, ఉహద్ పర్వతం మొదలగు చారిత్రక స్థలాలను కూడా సందర్శించి రావటం జరిగింది. కారుణ్య ప్రభువైన అల్లాహ్ ఈ ధన్యజీవుల ఉమ్రాకు ఆమోదముద్ర వేయాలని, వీరి విశ్వాసంలో సమృద్ధిని వొసగాలని, సన్మార్గంలో వీళ్ళందరికీ సహనస్థైర్యాలు ప్రసాదించాలని 'నెలవంక' సిబ్బంది నిండు హృదయంతో ప్రార్థిస్తోంది.





# లబ్బైక్ అల్లాహుమ్మ ఉమ్రతన్



ముహమ్మద్ బిలాల్

అల్‌హమ్దులిల్లాహ్ 20/05/2009 తేదీన 2గం ఐపిసి నుండి రెండు బస్సుల బృందం బయలు దేరింది. ప్రయాణం సాగే కొద్దీ మనస్సులో ఆత్రుత, ఉత్సాహం. అదేమంటే చిన్నప్పటి నుండి కథలు కథలుగా వింటున్న మక్కా మదీనాలను స్వయంగా చూడబోతున్నామన్న ఉత్సాహం. ఎట్టకేలకు అల్లాహ్ దయ వలన 21/05/2009 రాత్రి 10గంటలకు మా బస్సు మీఖాత్ (హజ్ ఉమ్రా దీక్ష బూనే స్థలం)కు చేరుకొనింది. అక్కడ స్నానములు ఆచరించి ఇహ్రాం దీక్ష బూని, అక్కడి నుండి మక్కాకు బయలుదేరాము.

మస్జిదె హరామ్‌లో మొదటిసారిగా కాబతుల్లాను చూడగానే జీవితంలో పొందలేనిదేదో పొందినంత తృప్తి మరియు తెలియకుండానే కండ్ల నిండా ఆనందభాష్పాలు రాలిపోతున్నాయి. తమాయించుకొని అందరమూ గ్రూపుగా తవాఫ్ చేశాము. మధ్యలోనే ఫజర్ నమాజు నెరవేర్చుకున్నాము. తర్వాత మకామె ఇబ్రాహీమ్ దగ్గర రెండు రకాతులు నమాజు చదువుకొని జమ్జమ్ బావి దగ్గర వెళ్ళి తనివి తీరా నీళ్ళు త్రాగాము. ప్రవక్తగారు తెలిపిన విధంగా జమ్‌జమ్ నీళ్ళు త్రాగిన తరువాత దుఆ చేసుకున్నాము. మెల్లగా జనంలో నుండి సఫా పర్వతంపైకి చేరుకొని దుఆ చేసుకొని సయీ చేయడం మొదలు పెట్టాము.

మక్కాలో ఉన్న 3 రోజులూ ప్రతి నమాజు మస్జిద్ అల్ హరామ్‌లోనే చేసుకుంటూ జమ్‌జమ్ బావి గురించి మరియు ఇబ్రాహీమ్ (అ), ఇస్మాయీల్ (అ) గారు కాబతుల్లాహ్ నిర్మించిన విధానం గురించి తెలుసుకున్నాము. ముఖ్యంగా అక్కడ చూడవలసిన చారిత్రాత్మక స్థలాలను సందర్శించాము.

25/05/2009 తేదీన ఉదయం సుమారు 8:30 గంటలకు మదీనాకు బయలు దేరాము. దారి మధ్యలో ప్రవక్త(స) గారు వలస వెళ్ళిన విధానం, పరిస్థితుల గురించి తెలుసుకొని కస్సీటి పర్యంతం అయ్యాము. మధ్యాహ్నం 2 గంటలకు మదీనా నగరానికి చేరుకున్నాము. అస్ర్ నమాజు మస్జిద్ నబవీలో చదువుకున్నాము. తర్వాత రౌదతుల్ జన్నహ్‌ను సందర్శించినపుడు మేము చెందిన అనుభూతి వర్ణనాతీతం.

ముఖ్యంగా అక్కడ చూడవలసిన చారిత్రాత్మక స్థలాలను సందర్శించాము. ఆ స్థలాల గురించి (జబలె ఉహద్, మస్జిద్ అల్ ఖుబా, మస్జిద్ అల్ ఖిబ్లతైన్, కందఖ్, దివ్య ఖుర్‌ఆన్ ప్రింటింగ్ ప్రెస్) జాసిమ్ సాలెహ్ గారు అరబ్బీలో తెలుపగా మేము తర్జుమా చేసి తెలుగులో తెలిపాము.

27/05/2009 సాయంత్రం 6గంటలకు ఐపిసి కువైట్ సిటీకు అల్లాహ్ దయ వలన చేరుకున్నాము. అల్లాహ్ మాకు ఈ ఉమ్రా చేసే సదవకాశాన్ని ప్రసాదించినందుకు వేనవేల కృతజ్ఞతలు తెలుపుకొంటూ ఐపిసి వారికి, మా టీచర్ల కోసం దుఆ చేస్తూ మా నివాసాలకు చేరుకున్నాము.

# 'నికాహ్' పుస్తకావిష్కరణ







వివాహాది శుభకార్యాలలో మహా ప్రవక్త (స) వారి మహితోక్తులను చిత్తశుద్ధితో అమలు పరచనంతవరకూ ముస్లిం సమాజం దురాచారాల ఊబి నుండి బయటపడదని పండితులు, వక్తలు వక్కాణించారు. 28-05-2009 వ తేదీ గురువారం రాత్రి కువైట్ సిటీలోని మర్ఖూబల్ బదర్ మస్జిద్‌లో అల్ ఫారూఖ్ పబ్లిషర్స్ వారు ప్రచురించిన **"ఇస్లామీయ వ్యవస్థలో నికాహ్"** అనే తెలుగు పుస్తక ఆవిష్కరణ సందర్భంగా పలువురు ప్రముఖులు ప్రసంగించారు. గతంలో ఇదే వేదిక నుండి, కట్నం పుచ్చుకోకుండా పెళ్ళి చేసుకుంటామని ప్రకటించి, మాట నిలుపుకున్న యువకులను వక్తలు అభినందించారు.

**నెలవంక** సంపాదకులు జనాబ్ **ముహమ్మద్ అజీజుర్రహ్మాన్** అధ్యక్షతన జరిగిన ఈ ఆవిష్కరణోత్సవంలో ఐపిసి దాయి మౌలానా **సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ** 'నికాహ్ ఆవశ్యకత' అన్న అంశంపై ప్రసంగించారు. పుస్తకంపై అభిప్రాయాలను వ్యక్తపరచిన వారిలో కడప సొసైటీ (కువైట్) అధ్యక్షులు **షేక్ రియాజ్**, సొసైటీ డైరెక్టర్ **ముహమ్మద్ హనీఫ్**, ఎస్.ఎస్.సి విభాగం ఛీఫ్ **షౌకతుల్లా** తదితరులున్నారు. సోదరులు **శ్రీ రామయ్య**, రవిగార్లు పుస్తకం తొలి ప్రతులను అందుకున్నారు. అంతకు ముందు ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా వ్యవహరించిన అల్ ఫారూఖ్ పబ్లికేషన్స్ అధ్యక్షులు **షేఖ్ ఇస్మాయీల్ అలీ** ఈ పుస్తకాన్ని ప్రచురించటానికి పురికొల్పిన పరిస్థితులను వివరించి, నానాటికీ జటిలమవుతున్న వరకట్న దురాచారాన్ని నిర్మూలించటానికి యువకులు పెద్ద మనసుతో ముందుకు రావాలని కోరారు.



- అబ్దుర్రహీమ్

# ....అట్టి స్వామి నిను వదలేసి చెట్టు పుట్టలను కొలచుటయా!?

అల్‌హమ్దులిల్లాహ్ కువైట్‌కి వచ్చినవారు చాలా మంది ఇస్లాం స్వీకరించారు. అలాంటివారిలో నేనూ ఒకణ్ణి. ఇస్లాం స్వీకరించాను బాగుంది. కాని మరలా దొంగచాటున సృష్టిని పూజించటం తప్పు అని తెలియాలి. విగ్రహారాధన వల్ల మనకు స్వర్గం ప్రాప్తించదు. అది కేవలం అల్లాహ్ ద్వారా మాత్రమే లభిస్తుంది. అంతేకాదు 'ముస్లిం' అనేవాడు ఉదయం ఫజ్ర్ నమాజు నుంచి చివరి ఇషా నమాజు వరకు 'సల్లీ' చేయాలి. పేదవారిని కనికరించాలి. ఎదుటి వారికి సహాయం చేయాలి. అనుక్షణం అల్లాహ్‌ను స్మరిస్తూ ఉండాలి. నీవు అడుగు తీసి అడుగు వేస్తున్నావు అంటే అది కేవలం అల్లాహ్ ద్వారానే అని నీవు తెలుసుకోవాలి.

అంతేకాని నీవు సృష్టిని పూజించడం వల్ల లాభం లేదు. విగ్రహాల్ని చూడండి- అది చలనం లేని బొమ్మ తప్ప మరి ఏమీ కాదు. అది కనులు ఉన్నా చూడదు, నోరున్నా మాట్లాడదు, ముక్కు ఉన్నా వాసన చూడదు. అయినా కూడా ముస్లింగా ఉండి మరలా పాత పద్ధతుల ప్రకారం చేయడం తప్పు కదూ! దొంగ చాటుగా ఫోటో పెట్టి, దానికి దండం పెట్టి దాని ముందు గుంజీలు తీయటం, మరల దానిని దాచివేసి మరలా ముస్లింగా ముసుగు వేయడం ఇది మంచి పద్ధతి కాదు.

ప్రియ సోదరా! ఇస్లాం అంటే ఏమిటి? అని ఒకసారి ఆలోచించు.. ఇస్లాం అనేది ఒక సముద్రం వంటిది. సముద్రాన్ని చూడండి: అందులోకి ఎంతో నీరు ప్రవహిస్తుంది. కాని సముద్రంలోని నీరు బయటకు రాదు. అందులోని నీరు ఎంత బయటకు లాగినా నీరు తగ్గదు. నిజమైన ముస్లిం కూడా నిండు కుండలా ఉంటాడు. కొత్త ముస్లిం అయినప్పుడు కొన్ని కష్టాలు, బాధలు వస్తాయి. వాటిని అధిగమించాలి. నీవు సజ్దాలో ఉండి అల్లాహ్‌ను అడుగు, తప్పకుండా నీకు సహాయం చేస్తాడు. నీవు నిండు హృదయంతో అల్లాహ్‌ను అడుగు, ఆయన తప్పకుండా నీ మొరను వింటాడు. నీ పశ్చాత్తాపానికి ప్రతిఫలంగా ఆయన నీకు మంచి మార్గాన్ని ఇస్తాడు. నీ మొర ఆలకిస్తాడు. నీకు సహాయం చేయడానికి ఆయన చేతులు కురచ కాదు. నీవు ఏ స్థలంలో ఉన్నా, ఎక్కడ ఉన్నా, ఏ పరిస్థితిలో ఉన్నా ఆయన తప్పకుండా సహాయం చేస్తాడు. అది ఎప్పుడు తెలుసా? నీవు ఇస్లాంలో పూర్తిగా చేరు. అప్పుడు ఎవరు ఊహించనంతగా నిన్ను పైకి లేపుతాడు.

ఇస్లాం స్వీకరించాక నాకు కూడా చాలా కష్టాలు వచ్చాయి. తల్లిదండ్రులు నన్ను వెలివేశారు. అన్నయ్యలు నన్ను ఇప్పటికీ దూషిస్తారు. నన్ను ఇంటిలోంచి బయటకు నెట్టేసారు. చివరికి నేను సంపాదించిన సంపాదనను వారు తీసుకొని నీకోసం చేసిన అప్పుని నీవే తీర్చుకో అని నన్ను ఒక తప్పు చేసినవాడిగా చూశారు. అయినా నేను ధైర్యం విడువలేదు. ఉదయం నుంచి నేను రాత్రి ఇంటికి వచ్చేవరకు అల్లాహ్ తోడ్పాటు వలన ఇంతవరకు నాకు ఎటువంటి నష్టము కలుగలేదు. నాకు మరణం అయినా బ్రతుకు అయినా ఆయన ద్వారా తప్ప ఇక ఎవరి వలనా కాదు. ఇది సత్యం!

ఇస్లాంలో ఉంటూ షిర్క్ వైపునకు మరలితే అది ఎంత పాపమో ఒకసారి ఆలోచించు. ఈ సృష్టి ఏర్పరచింది అల్లాహ్. గాలిలో వ్రేలాడుతున్న గ్రహాలు సూర్యచంద్ర నక్షత్రాలు శూన్యంలో ఏ ఆధారం లేకుండా గాలిలో ఉన్నాయి అంటే అది అల్లాహ్ గొప్పతనమే. చివరికి నీవు ఉంటున్న భూమి కూడా ఆయనే సృష్టించాడు. గాలి, నీరు, నిప్పు, పర్వతాలు అన్ని ఆయన ద్వారానే కలిగినవి. చివరికి ప్రాణం ఉన్న నీ దేహం కూడా నీది కాదు. అటువంటి నీవు సృష్టికర్తను వదలి సృష్టితాలను పూజించడం అన్యాయం. ఇలా చేసి ఆయన క్రోధకు గురికావద్దు. ప్రళయ దినాన నీవు ఎక్కడికి వెళతావు? నీవు మరణించిన తరువాత నీవు ఎక్కడికి పోతావు? ఆయన ఎదుట నీకు నించునే అర్హత కూడా ఉండదు. ప్రళయ దినాన నీవు పూజించే మిథ్యా దేవుళ్ళు నిన్ను రక్షించరు. నీవు అరచి 'గీ' పెట్టినా ఎవరు నిన్ను రక్షింపలేరు. స్వర్గమార్గం ఎన్నో కష్టాలతో, కఠిన పరీక్షలతో కూడుకున్నది.

నరకం ఎంతో సులువైన మార్గం. ఈ మార్గంలో శ్రమ ఉండదు. బాధలు ఉండవు. ఎటువంటి కష్టనష్టాలుండవు. కాని నరకమార్గంలో మరణిస్తే నీవు స్వర్గంలోకి వెళ్ళవు. అదే విధంగా కష్టాలు, శ్రమలు అన్నింటిని అధిగమించి ప్రయాణించి నట్లయితే నీవు స్వర్గంలో చేరుతావు. అది ఎంతో అందమైన లోకం!

# అల్లాహ్ అందరికీ ప్రభువు<br>ఖుర్ఆన్ అందరి గ్రంథం<br>ముహమ్మద్ (స) అందరి ప్రవక్త

- ఉమ్మె ఫాతిమా

ఖుర్ఆన్‌లో దేవుడు ఏమంటున్నాడో చూడండి!

"మానవులారా! మీ ప్రభువు తరఫు నుండి మీ వద్దకు స్పష్టమైన నిదర్శనం వచ్చేసింది. మేము మీ వద్దకు స్పష్టమైన జ్యోతిని పంపాము". (అన్ నిసా- 174)

2) "ఇది (ఖుర్ఆన్) ప్రజలకు ఒక స్పష్టమైన బోధన, అల్లాహ్‌కు భయపడేవారి వారికి మార్గదర్శకం మరియు హితోపదేశం".

(ఆలి ఇమ్రాన్-138)

3) "ఓ ముహమ్మద్! వారికి చెప్పండి: 'ప్రజలారా! మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుండి సత్యం వచ్చేసింది. కాబట్టి ఇప్పుడు ఎవడు సరైన మార్గం అవలంబిస్తాడో అతడు సన్మార్గాన్ని అనుసరించటం అతని కొరకే లాభదాయకం; ఎవడు మార్గం తప్పాడో ఆ మార్గం తప్పటం అతని కొరకే వినాశకరం". (యూనుస్ - 108)

ఈ వాక్యములలో గమనించదగ్గ విషయమేమిటంటే దేవుడు "మానవులారా!", "ప్రజలారా!" అనడం. దీనిని బట్టి అర్థమయ్యేది ఏమిటంటే,ఖుర్ఆన్ కేవలం ముస్లింల కొరకు అవతరించబడినది కాదు! ఇది ప్రపంచ ప్రజలందరి కొరకు జ్యోతిగా వచ్చినదని లేదా మార్గదర్శకముగా వచ్చినదని అర్థమగుచున్నది.

దీన్ని బట్టి చాలా మందికి (ముస్లిములతో సహా) ఉన్న అపోహ "ఇది (ఖుర్ఆన్) ముస్లింలకు ప్రత్యేకించిన గ్రంథమన్న అపోహ" దూరమవుచున్నది.

ఇలా దేవుడు అందరి కొరకూ పంపిన గ్రంథాన్ని మనం కేవలం ముస్లింలకని ప్రత్యేకించుకోవటం వల్ల, ఖుర్ఆన్ బోధనల వల్ల లభించే ఎన్నో శుభాలను కోల్పోతున్నాం.

అల్లాహ్ అంత గొప్ప ఆశీర్వాదాన్ని అందరికి అందిస్తున్నప్పుడు మనమై దానిని పుచ్చుకోక పోవటం, మన అమాయకత్వమో, మన అహంకారమో, మన వెర్రితనమో, మన మూర్ఖత్వమో మనమే నిర్ణయించుకోవాలి.

ఖుర్ఆన్ చదివి, నమ్మి పాటించేవాళ్ళకు ఇది ఓ గొప్ప ఆశీర్వాదపు గ్రంథము. ఆయన ఆశీర్వాదము ఎవరికి మాత్రం ఇష్టం ఉండదు? మరి ఎవరికి మాత్రం అవసరం లేదు? అందరికీ అవసరమే కదా!

కాబట్టి ఆయన ఆశీర్వాదాన్ని తీసి పుచ్చుటానికి కించిత్తయినా భయమున్న యెడల మంచి మానవులుగా మన మందరము సంకుచిత భావాలను వీడి మనందరినీ పుట్టించిన ఆ ఏకేశ్వరుడి మాటలను శిరసావహించాలన్న తపనతో ఖుర్ఆన్ తెరిచి, చదివి, అర్థం చేసుకోవడంలో ఏ మాత్రం ఆలస్యం చేయకుండా కృషి చేయాలి.

అటుపిమ్మట వాటి మీద అమలు పరచడానికి కృషి చేయాలి. ఎందుకంటే జీవితం క్షణభంగురం.

చివరగా ఇంకొక్కసారి నిజమైన, విలువైన మాటను మననం చేసుకుందాం.

మనందరికీ అంటే భూలోక జనులందరికీ కలిపి ఒక్కడే దేవుడు.

ఇదే "దేవుడు ఒక్కడే"లో ఉన్న పరమార్థం.

**"అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహ్ వ అష్హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్".**





# నెలవంక ఉత్తరాలు

## సన్మార్గ దర్శిని

గౌరవనీయులైన **నెలవంక** ఎడిటర్ గారికి సలాములు. నాకు నెలవంక మాస పత్రిక చాలా బాగా నచ్చింది.

అల్‌హమ్దులిల్లాహ్ నేను ముస్లింని. కాని నాకు అంతగా ఇస్లాం గురించి తెలియదు. నేను ఇప్పుడు గత 3 నెలలుగా (ఐపిసి రౌదా) లో స్టూడెంట్‌గా చేరాను అల్‌హమ్దులిల్లాహ్. నేను **నెలవంక** చూశాను. నా టీచర్‌కి కూడా ఈ **నెలవంక** ద్వారా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. **నెలవంక** ద్వారా తెలియని విషయాలు చాలా తెలుసుకున్నాను. ఒకప్పుడు నేను ఒక్కదాన్నే ఇంట్లో కూర్చోని బోర్ అయిపోయేదాన్ని. కాని ఇప్పుడు ఈ **నెలవంక** పత్రిక చదివి నమాజ్, ఖుర్‌ఆన్‌తో నా టైం వృధా కాకుండా దైవారాధనలో సంతోషంగా జరుగుతుంది. నాతోటి ముస్లిం సహోదరిమణులకు నేను చెప్తున్నాను- ఒంటరితనం పిచ్చి ఆలోచనలు అన్నీ వీడాలంటే మంచి ఆయుధం లాంటిది దైవారాధన. నన్ను నమ్మండి.... నేను ఒక్కదాన్ని చాలా బోర్‌గా ఫీలు అయ్యేదాన్ని. ఒంటరితనంలో కోపం వచ్చేది. ఏవేవో పిచ్చి ఆలోచనలతో సతమతమయ్యేదాన్ని. ఇప్పుడు అలా లేదు. నెలవంక ద్వారా నా సంతోషాన్ని వ్యక్తపరుచుకోవాలనుకున్నా. ఓ అల్లాహ్ నా ప్రయత్నం ఫలించుగాక! (ఆమీన్.)

నా ఒంటరితనంలో సఖి అయింది **నెలవంక**
నాకు సన్మార్గం చూపించే ఒక గైడ్ అయింది **నెలవంక**
తెలియని విషయాలని తెలిపే టీచర్ అయింది **నెలవంక**
సకల సమాచారాల మణిహారం నా కోసం **నెలవంక**.

– షేక్. గౌసియా బేగం
(వైరా)

## ప్రవక్తల గాథలు ప్రచురించండి

గౌరవనీయులైన ఎడిటర్‌జీ

**నెలవంక** ఎన్నో విషయాలు తెలియజేస్తూ మమ్ము ముందుకు నడిపిస్తున్నది. మేము ప్రతి నెలా వచ్చే **నెలవంక** కోసం నిరీక్షిస్తూ వచ్చిన వెంటనే **నెలవంక** ను చదివి మా మదిలో భద్రంగా దాచుకొంటున్నాము. మేము **నెలవంక** ద్వారా ప్రవక్తలందరి గాథలు తెలుసుకోగోరుచున్నాము. దయచేసి మా కోరిక తీరుస్తారని మనవి.

మీ విధేయుడు
కె. అబ్దుల్లాహ్ (కట్టా వెంకటేశ్వర్లు)
(హావల్లి)

## జోహార్లు

మా **నెలవంక** ఒక ఉదయ కిరణం
అది చీకటి రేఖలను చీల్చుకు వచ్చే రవి తేజం
మా **నెలవంక** ఒక అక్షర దీపం
అది మార్గభ్రష్టత్వంలో మ్రగ్గే హృదయాలను ప్రక్షాళనం
గావించే అద్భుత ఔషధం
మా **నెలవంక** ఒక లలిత కుసుమం
అది జీవితాల్ని పునీతం చేసే పూవనం
మా **నెలవంక** ఒక ఆశా దీపం
అది చీకటి బ్రతుకుల్లో సరికొత్త కాంతి కిరణం
మా **నెలవంక** ఒక ఆయుధం
అది శాంతి విఘాతకుల్ని చీల్చి చెండాడే శరం
మా **నెలవంక** ఒక అగ్ని కణం
అది నిత్యం చెడుగుల్ని రూపుమాపే ధర్మ తేజం
మా **నెలవంక** ఒక విప్లవ గీతం
అది నిరాశ నిండిన హృదయాలను తట్టి
లేపే నాదం, అజాన్ నినాదం
గతుకుల బతుకు బాటలో
నడవలేక నలిగిపోయే జనాలకు
స్నేహ పరామర్శ మా **నెలవంక**
పద్ద ప్రతివాడూ చెడ్డవాడు కాదని
బతుకు బాటను బాగు చేసుకోమని చెప్పే
అభయ హస్తం, ప్రియ నేస్తం మా **నెలవంక**!
ఓ **నెలవంక**!
నీకు జోహార్లు....!!
ప్రేమాభినందనాలు...!!!

– కనీజ్ సుల్తానా, షమీమ్ సుల్తానా, ఫర్హా (ఖైతాన్)

# వివేచన

దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: "మీరు (అల్లాహ్‌ను) విశ్వసించనంతవరకు స్వర్గంలోకి ప్రవేశించలేరు. అలాగే మీరు పరస్పరం ప్రేమించుకోనంత వరకూ (పూర్తిగా) విశ్వసించలేరు. మీరు ఒండొకరిని ప్రేమించుకోవాలంటే ఏం చేయాలో నేను మీకు తెలుపనా? మీ మధ్య 'సలాం'ను సర్వసామాన్యం చేసుకోండి. (ఒండొకరికి ఎక్కువగా సలాములు చేస్తూ ఉండండి.)" (ముస్లిం)



# ఓ మనిషీ! ఏనాడైనా ఆలోచించావా?

- నీవు కలకాలం బ్రతికే ఉంటావని అనుకుంటున్నావేమో! అసంభవం. ఈ లోకం త్వరలోనే నిన్ను బ్రతికున్నవారి లిస్టులో నుండి తొలిగించి మృతుల జాబితాలో చేరుస్తుంది.
- తల్లిదండ్రులు నీ కోసం ఎంతో విలపిస్తారు. కడకు నిరాశతో నిట్టూర్పు విడుస్తారు. బంధు మిత్రులు కూడా కొంత కాలమే జ్ఞాపకముంచుకుంటారు.
- కట్టుకున్న ఇల్లాలు కూడా కొన్ని మాసాలు సంతాపం పాటించి, కడకు కాలం వేసిన కళ్ళెంలో ఇరుక్కుంటుంది.
- కన్నబిడ్డలు ఎంతగానో ఏడుస్తారు. కాని కొన్నాళ్లకు వాళ్ల మనోఫలకం నుండి కూడా నీవు చెరిగిపోతావు.
- ఎత్తయిన నీ సమాధి కూడా గాలి వానలకు నేలమట్టమైపోతుంది. కొన్నేండ్ల తర్వాత నీవు చెదిరిన కలలా మిగిలిపోతావు.

## అందుకే ...

ఈ ప్రపంచంపై మరీ అంతగా మోజు పడకు...పరలోకంలో ఉపయోగపడేదాన్ని సమకూర్చుకో... శాశ్వతమైన ఆ లోకం నీ కొరకు నిరీక్షిస్తోంది.

గతించిన నిన్నటి పాపాలపై క్షమాపణ వేడుకో... సదాచరణకు ఇకనైనా ఉపక్రమించు... సాటి మనుషులతో సఖ్యంగా మసలుకో...

**నింగినున్నవాడు కనికరించాలన్నదే నీ అభిలాష అయితే నేలనున్న అభాగ్యులకు చేయూతనిచ్చి నిలువు.**

**ఊర్ధ్వలోకాల్లో ఉన్నత సోపానాలు అధిరోహించాలనుకుంటే భూలోకంలో తలవంచుకుని జీవించు.**